
Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 20.06.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 03 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# హైదరాబాదు వీడితేనే... సీమాంధ్రకు శుభం..!



- సీమాంధ్ర పారిశ్రామికవేత్తలంతా ఏకమైతే రాష్ట్రంలో ప్రగతి పరుగులు
- హైదరాబాద్ నుండి సినీపరిశ్రమ తరలితే విశాఖకు వెలుగులు
- ఆధ్యాత్మిక రాజధానిగా తిరుపతికి మెరుగులు

*హైదరాబాద్... నిన్నటివరకు 8కోట్ల తెలుగువారి ఆస్థి. ఈరోజు 5కోట్ల మంది తెలుగు ప్రజలకు చెదిరిన స్వప్నం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆరున్నర దశాబ్దాల తర్వాత కూడా 13జిల్లాల సీమాంధ్ర ప్రాంతానికి ఒక రాజధాని నగరం అంటూ లేకుండా అనాథగా మిగిలిందంటే దానికి కారణం హైదరాబాద్ నగరమే. హైదరాబాద్‌పై మనం పెంచుకున్న మోజే ఈరోజు మనల్ని రోడ్డు మీద నిలబెట్టింది.*



అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో 1951లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. కష్టమో నష్టమో ఈరోజు కర్నూలులోనే వుండి రేకులషెడ్లలోనైనా పరిపాలన సాగించి వుంటే ఇప్పుడు హైదరాబాద్ స్థాయిలో కర్నూలు ఉండేది. హైదరాబాద్ అభివృద్ధి ఈ స్థాయిలో ఉండేది కాదు. కాని ఆరోజు సీమాంధ్ర నాయకులకు కర్నూలులో ఉండాలంటే కష్టమనిపించింది. హైదరాబాద్‌లో భవనాలు, రోడ్లు చూసి దానిపై మనసుపడ్డారు. తెలంగాణ వారితో కలిసి 1953లో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా హైదరాబాద్‌ను ఏర్పాటు చేసారు. అప్పటి నుండి నిన్న మొన్నటి వరకు కూడా అందరూ కట్టిన పన్నులతోనే హైదరాబాద్‌ను ఒక అంతర్జాతీయ నగరం స్థాయిలో అభివృద్ధి చేసుకుంటూ వచ్చారు. 60ఏళ్ల పాటూ కలిసి అభివృద్ధి చేసుకున్న హైదరాబాద్‌ను ఈరోజు సీమాంధ్రులు పూర్తిగా వదులుకుని వట్టి చేతులతో రావాల్సి వచ్చింది.


ఇప్పటిదాకా జరిగిన సంఘటనలతోనన్నా సీమాంధ్ర నాయకులు బుద్ధి తెచ్చుకోవాలి. గుణపాఠం నేర్చుకోవాలి. హైదరాబాద్‌పై మోజును ఇకనన్నా విడనాడాలి. కష్టమైనా, నష్టమైనా సీమాంధ్రలోనే ఒక ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేసుకుని పూర్తి స్థాయి రాష్ట్ర పరిపాలనను అక్కడి నుండే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర విభజన బిల్లులో పదేళ్ల పాటు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా ఉంచారు. పదేళ్లపాటూ రాష్ట్ర పరిపాలన అక్కడ నుండే జరిగితే ఇక్కడ రాజధాని అభివృద్ధి పదేళ్లు వెనక్కి పోయినట్లే! పదేళ్ల తర్వాతైనా అక్కడ నుండి వట్టి చేతులతోనే రావాలి. ఇక్కడ రాజధాని నగరాన్ని ఎంపిక చేసి, పరిపాలనా (మిగతా 10వ పేజీలో)

- ఋణమాఫీ

## సందిగ్ధంలో అధినేత
# అయోమయంలో అన్నదాత

**అధికారం చేతికొచ్చిందన్న మాటేగాని చంద్రబాబులో ఆ ఆనందం కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం ఋణమాఫీ. చంద్రబాబు అధికారం కలను నిజం చేసిన ఋణమాఫీనే ఇప్పుడు ఆయనకొక పీడకలగా మారింది. నూరు శాతం అధికారం ఖాయమనుకున్న జగన్ ప్రతిపక్షంలో ఉండడానికి, అధికారం కలేననుకున్న చంద్రబాబు సీఎం కావడానికి ఒకే ఒక్క అడ్డగీత ఋణమాఫీ!**

ఇప్పుడు చంద్రబాబు ఋణమాఫీ మీదనే కసరత్తు చేస్తున్నాడు. ఈ హామీని ఎలా నెరవేర్చాలో తెలియక జుట్టు పీక్కుంటున్నాడు. కోటి, వంద కోట్లు, కనీసం వెయ్యికోట్లు కాదు, 83వేల కోట్లు. ఏ మార్గంలో చూసినా ఇది సాధ్యమయ్యేటట్లు కనిపించడం లేదు. ఋణమాఫీ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా సాయం అందించేటట్లు లేదు. రిజర్వ్‌బ్యాంకు చూస్తే మీరు డబ్బు చెల్లిస్తే ఋణమాఫీకి ఒప్పుకుంటామంటుంది. బాండ్లు, గీండ్లు చెల్లవంటుంది. అసలే లోటు బడ్జెట్ వుంటే ప్రభుత్వం (మిగతా 10వ పేజీలో)






# ఆనం వారికి దారేది..?



## తెలుగుదేశంలో చేరడం నిజమేనా?

## బాబు ముందు చేతులు కట్టుకోవడం జరిగేనా?

**సీమాంధ్ర ప్రజలకు కాంగ్రెస్‌పార్టీ చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు... ఆ పార్టీ అధిష్టానం ప్రజలకే కాదు సీమాంధ్రలోని తమ నాయకులకు కూడా భవిష్యత్ లేకుండా చేసింది. ఇలాంటి సీమాంధ్ర ప్రాంతంలో ఇక కాంగ్రెస్‌కు భవిష్యత్ ఉంటుందనుకోవడం అమాయకత్వమే. ప్రజల కోపం ఏ స్థాయిలో వుందో నిన్నటి ఎన్నికలలోనే వెల్లడైంది. ఇంకో ఐదేళ్ల తర్వాత అది తగ్గుముఖం పడుతుందనే నమ్మకం కూడా లేదు. అదీగాక రాష్ట్రంలో రెండు బలమైన ప్రాంతీయ పార్టీలున్నాయి కాబట్టి కాంగ్రెస్ కోలుకోవడం అనుమానమే.**

ఈ పరిస్థితిని చాలా మంది కాంగ్రెస్ నాయకులు ముందుగానే ఊహించారు. కాబట్టి వెంటనే తట్టాబుట్టా సర్దుకుని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలోకి అక్కడ అవకాశం లేనివాళ్లు తెలుగుదేశంపార్టీలోకి మారారు. కాంగ్రెస్ మా రక్తం, కాంగ్రెస్ మా ప్రాణం అనుకున్నవాళ్లు ఇంకా కొందరు ఆ పార్టీలో మిగిలివున్నారు. వారిలో నెల్లూరుజిల్లాకు చెందిన ఆనం సోదరులు ముఖ్యులు. కనుచూపు మేరలో (మిగతా 10వ పేజీలో)

# ఇన్‌ఛార్జ్‌లపై తమ్ముళ్ల కన్ను



అధికారపార్టీలో ఓడిపోయినవాళ్లు పవర్ చూపించగలిగేది నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లుగానే! ప్రతిపక్ష ఎమ్మెల్యేకంటే అధికారపక్ష ఇన్‌ఛార్జ్ ఎక్కువ ఫోర్స్‌లో ఉంటాడు. జిల్లాలో ఈ ఇన్‌ఛార్జ్ పదవుల కోసం తెలుగుతమ్ముళ్లు తీవ్రంగా పోటీపడుతున్నారు. నెల్లూరు లోక్‌సభకు మొన్న ఎన్నికలలో ఓడిపోయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డే ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించనున్నారు. జిల్లాలోని పది అసెంబ్లీలకు గాను కోవూరు, ఉదయగిరి, వెంకటగిరిలలో మాత్రమే తెలుగుదేశం గెలిచింది. ఇక్కడ ఇన్‌ఛార్జ్‌ల సమస్య లేదు. ఓడిపోయిన స్థానాలలో మాత్రం ఇన్‌ఛార్జ్ హోదా కోసం పలువురు పోటీ పడుతున్నారు.

నెల్లూరు నగరం సీటు నుండి ఓడిపోయిన ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ఇన్‌ఛార్జ్ కోసం పట్టు పడుతున్నారు. అయితే నగర తెలుగుదేశంపార్టీ అధ్యక్షులుగా వున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా ఇన్‌ఛార్జ్ కోసం ప్రయత్నిస్తున్నారు. నెల్లూరురూరల్‌ను మొన్న బీజేపీకి ఇచ్చారు. ఆ సీటులో బీజేపీ ఓడిపోయింది. ఇప్పుడు తెలుగుదేశంపార్టీ తరపున ఇన్‌ఛార్జ్‌ను నియమించాల్సివుంది. గతంలో రూరల్ కన్వీనర్‌గా వున్న కిలారి వెంకటస్వామి నాయుడుకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగిస్తారా లేక మిత్రపక్షం కాబట్టి బీజేపీ అభ్యర్థిగా ఓడిపోయిన సన్నపరెడ్డి సురేష్‌రెడ్డికి ఇన్‌ఛార్జ్ ఇస్తారా అన్నది చూడాలి. గూడూరులో ఎన్నికల్లో ఓడిపోయిన డాక్టర్ బి.జ్యోత్స్నలత ఇన్‌ఛార్జ్ కావాలని కోరుకుంటున్నారు. అదే సమయంలో గూడూరు మాజీఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు కూడా ఇన్‌ఛార్జ్ కోసం ప్రయత్నిస్తున్నారు. సూళ్లూరుపేటలో పరసా రత్నంకు కాకుండా వేరేవారికి ఇన్‌ఛార్జ్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కావలి, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్ బాధ్యతలు మాత్రం మొన్న ఎన్నికల్లో ఓడిపోయిన తెలుగుదేశం అభ్యర్థులకే కట్టబెట్టే సూచనలున్నాయి.

# ప్రతాపం చూపించాడు




మొన్నటి ఎన్నికల్లో నెల్లూరుజిల్లాలో తెలుగుదేశంపార్టీ ఖచ్చితంగా గెలుస్తుందని అంచనా వేసిన మొదటి సీటు కావలి అసెంబ్లీ. ఈ అంచనాకు ప్రధాన కారణం 5ఏళ్లు కావలి ఎమ్మెల్యేగా పనిచేసిన బీద మస్తాన్‌రావుపై వ్యతిరేకత లేకపోవడమే. ఎమ్మెల్యేగా అంతో ఇంతో పనిచేసాడు. నియోజకవర్గంలో బి.సిలు ఎక్కువ. సొంతంగా కేడర్ వుంది. కాబట్టి రెండోసారి కూడా బీద గెలుపు ఖాయమనుకున్నారు. తెలుగుదేశంపార్టీ గ్యారంటీ అనుకున్న ఆ స్థానం నుండే గెలిచి కూర్చున్నాడు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి. అంటే రామిరెడ్డి ప్రతాప్ ఈ ఎన్నికల కోసం ఎంతగా కష్టపడ్డాడో ఆయన గెలుపుతోనే అర్థమవుతుంది.

ప్రతాప్ తలపండిన రాజకీయ యోధుడు కాదు. ఎత్తులు, జిత్తులు తెలియవు. కాని ఏ పని చేపట్టినా దానిని సమర్థవంతంగా నెరవేర్చడమే తెలుసు. ఒక సాధారణ వ్యక్తిగా బెంగుళూరు రియల్‌ఎస్టేట్ రంగంలో అడుగుపెట్టిన ప్రతాప్ అక్కడ ఊహించని స్థాయికి వెళ్లాడు. విద్యారంగంలోనూ అడుగుపెట్టి కావలి సమీపంలో ఒక ఇంజనీరింగ్ కాలేజీని, మరో పబ్లిక్ స్కూల్‌ను నెలకొల్పారు. రాజకీయ రంగంలోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకోదలచి 2009లో చిరంజీవి పెట్టిన ప్రజారాజ్యంలో చేరారు. ఆ ఎన్నికలలో కావలి నుండి ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేసి మూడోస్థానంలో నిలిచారు. ఎన్నికల తర్వాత చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడంతో ప్రతాప్ వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. ప్రతాప్‌లోని ఉత్సాహాన్ని చూసి కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి వంటి సీనియర్‌ను పక్కనపెట్టి ప్రతాప్‌ను కావలి ఇన్‌ఛార్జ్‌గా నియమించాడు జగన్. ఆ తర్వాత జిల్లా స్థానిక సంస్థల శాసనమండలికి జరిగిన ఎన్నికల్లో ప్రతాప్ వైకాపా అభ్యర్థిగా బరిలో నిలిచారు. గెలిచినంత పని చేసి కేవలం 9ఓట్ల తేడాతో వాకాటి నారాయణరెడ్డి చేతిలో ఓడిపోయారు. అయినా నిరాశ చెందలేదు. 2014 ఎన్నికలే లక్ష్యంగా ప్రజాదీవెనయాత్ర పేరుతో కావలి నియోజకవర్గంలో అణువణువూ తిరిగాడు. మనిషిమనిషిని పలకరించాడు. ప్రతి ఒక్కరికీ చేరువయ్యాడు. ఆ కృషి ఫలితమే కావలి ఎమ్మెల్యేగా ప్రతాప్ విజయం.

## గాలిలో వున్న గెలిచినవాళ్ళు

# కొలువు తీరని పాలక మండళ్ళు





### ఇంకా కుదరని తేదీలు

జడ్పీ, ఎంపీపీ, మున్సిపాల్టీలకు ఇంతటి ఘండాలపు ఎలక్షన్ ఇంకెప్పుడూ జరగదేమో? ఎన్నికలు జరిగి మూడునెలలు కావస్తుంది. ఫలితాలొచ్చి నెల దాటిపోయింది. అయినా ఇప్పటి వరకు పాలకమండళ్ళు కొలువుతీరలేదు. అదీగాక ఈ ఎలక్షన్లు జరిగేనాటికి రాష్ట్రంలో గవర్నర్ పాలన ఉండింది. ఫలితాలు వచ్చిన మూడోరోజే కొత్త ప్రభుత్వం వచ్చింది. కొత్తప్రభుత్వం రాకముందే జడ్పీ ఛైర్మెన్‌లు, ఎంపీపీలు, మేయర్‌లు, ఛైర్మెన్‌లకు ఎన్నికలు నిర్వహించేసి ఉంటే ఓ పనైపోయి వుండేది. గెలిచిన వాళ్లు అటూ ఇటూ దూకే పనిలేకుండా పోయేది. కాని ఇప్పుడు రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రతిపక్షానికి ఇది ప్రాణగండంగా మారింది. ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మెజార్టీసీట్లు వచ్చిన చోట కూడా ఫలితాలు తారుమారవుతున్నాయి. జంప్‌జిలానీలు ఎక్కువవుతున్నారు. ప్రతిపక్షం నుండి అధికారపార్టీలోకి దూకేస్తున్నారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ చేజిక్కించుకోవాల్సిన మున్సిపాల్టీలు, జడ్పీలు, ఎంపీపీలు కూడా తెలుగుదేశం ఖాతాలోకి వెళుతున్నాయి. మున్సిపాల్టీల్లో అయితే పరిస్థితి మరీ ఘోరం. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం అయితే గత ప్రభుత్వంలో వున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు మున్సిపాల్టీలలో ఓటుకు అర్హులు. కాని సుప్రీంకోర్టు ఫలితాలను వాయిదావేయడం వలన అవి తారుమారయ్యాయి. సార్వత్రిక ఎన్నికలు జరగడంతో కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలు మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లలో ఓటర్లు కానున్నారు. దీంతో ఫలితాలు తారుమారయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి.

జిల్లాలో 46జడ్పీటీసీలు, 589మంది ఎంపీటీసీలు, నెల్లూరు కార్పొరేషన్, కావలి, గూడూరు, ఆత్మకూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట మున్సిపాల్టీలలో కలిపి 218మంది కార్పొరేటర్లు మరియు కౌన్సిలర్లు ఉన్నారు. ముందు గెలిచిన వీరందరు కూడా ఆయా సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ప్రమాణస్వీకారం చేయాలి. ఆ తర్వాత జడ్పీ ఛైర్మెన్, మేయర్, ఛైర్మెన్, ఎంపీపీ పదవులకు ఎన్నికలు నిర్వహించాలి. ఇప్పటివరకు వీటి ఎన్నికలకు సంబంధించి ఎటువంటి షెడ్యూల్ రాలేదు. ఈ నెల 19 నుండి అసెంబ్లీ సమావేశాలు. వాటి తర్వాతే అధికారులు వీటిపై దృష్టిపెట్టే అవకాశముంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో తాము ఏ రాష్ట్రం క్రిందకు వస్తామో తెలపాలని రాష్ట్ర ఎన్నికల సంఘం, గవర్నర్‌ను కోరింది. దీనిపై స్పష్టత వచ్చాకే వారికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశముంటుంది. ఇదంతా జరగడానికి ఇంకొంత సమయం పట్టే అవకాశముంది. ఎన్నికలు ఆలస్యమయ్యే కొద్ది వైయస్సార్ కాంగ్రెస్ తరపున జడ్పీ ఛైర్మెన్, మేయర్, ఛైర్మెన్, ఎంపీపీ పదవులకు అభ్యర్థులుగా రంగంలో వున్నవారికి తడిసి మోపెడవుతుంది. అధికారపార్టీ వలలోకి తమవాళ్లు పడకుండా వుండడం కోసం క్యాంపులు నిర్వహించడంతో పాటు పెద్దమొత్తంలో ఖర్చుచేయాల్సి వస్తుంది. ఈ ఎన్నికల దెబ్బకు చాలామంది ఆర్థికంగా నష్టపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.




# ఇఫ్‌కో సెజ్‌ను వాడుకుంటారా?

*రాష్ట్ర విభజన నేపథ్యంలో సీమాంధ్రను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సి ఉంది. సీమాంధ్రలోని అన్ని జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరగాలి. దీనికిగాను భారీ విస్తీర్ణంలో సీమాంధ్రలో భూమి అవసరమవుతుంది. సీమాంధ్రలో వ్యవసాయ భూములు ఎక్కువ. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాల్లో అన్నీ సారవంతమైన భూములే! వీటిని ఇతరత్రా కార్యక్రమాలకు వాడుకుంటే వ్యవసాయ ఉత్పత్తులు దెబ్బతింటాయి. నూతనంగా చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి కూడా వ్యవసాయ యోగ్యంగాని భూములనే ఎక్కువగా వినియోగించాల్సి వుంది. ఈ కోణంలో చూస్తే మన జిల్లాలో నిరుపయోగ భూముల లభ్యత బాగానే వుంది.*

అన్ని పరిశ్రమలు, ఇతరత్రా ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి చాలా చౌకలో భూములు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో శ్రీ సిటీ సెజ్, మేనకూరు సెజ్, చింతవరం సెజ్, కృష్ణపట్నంపోర్టు సెజ్‌లలో వేలాది ఎకరాల భూములున్నాయి. ఇప్పటికే ఈ సెజ్‌లలో పలురకాల పరిశ్రమలను ఏర్పాటు చేసారు. అన్నింటికి మించి నెల్లూరు - కావలి మధ్య జాతీయ రహదారిని ఆనుకుని ఇఫ్కో సెజ్ వుంది. దాదాపు ఆరువేల ఎకరాల భూమి అందుబాటులో వుంది. స్వర్గీయ పి.వి.నరసింహారావు ప్రధానిగా వున్నప్పుడు ఇఫ్కో ఎరువుల కర్మాగారం కోసమని ఇక్కడ కొంత భూమిని సేకరించారు. అయితే అప్పట్లో ఫ్యాక్టరీ ఏర్పాటు కాలేదు. దివంగత నేత వై.యస్.రాజశేఖర రెడ్డి హయాంలో ఇక్కడే మరికొంత భూమిని సేకరించి 'ఇఫ్‌కో కిసాన్ సెజ్'కు శంకుస్థాపన చేసారు. వ్యవసాయాధారిత పరిశ్రమల కోసం ఈ సెజ్‌ను పెట్టారు. అయితే ఒక్క వ్యవసాయ పరిశ్రమ కూడా ఇక్కడకు రాలేదు. ఎన్నో ఏళ్లుగా వేలఎకరాల భూమి నిరుపయోగంగా వుండడంతో తమ భూములను తాము తిరిగి సాగుచేసుకుంటామని స్థానిక రైతులు మళ్ళీ ఆందోళనలకు దిగుతున్నారు. నెల్లూరు పరిసరాలలో వున్న రైస్‌మిల్లులన్నింటిని ఈ సెజ్‌లోకి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాగే మరిన్ని వ్యవసాయాధారిత పరిశ్రమలను కూడా ఈ సెజ్‌లోకి తీసుకువచ్చే ప్రయత్నాలు జరగాలి. ఈ సెజ్‌ను వాడుకుంటే జిల్లా అభివృద్ధి ప్రక్రియలో ఓ అడుగు ముందుకు పడ్డట్లే!

# నెల్లూరు కోసం... పోరాడేదెవరు?



**జిల్లా రాజకీయాలు చాలా చప్పగా వున్నాయి. పోరాట దృక్పథం, వాక్పటిమ ఉన్న నాయకులు లేకుండా పోయారు. జిల్లా అభివృద్ధి గురించి, జిల్లాకు రావాల్సిన ప్రాజెక్ట్‌ల గురించి ఏ ఒక్క నాయకుడూ పట్టించుకోవడంలేదు. జిల్లాకు ఇది కావాలని ఎవరూ ఏమీ అడగడం లేదు. దీంతో సీమాంధ్ర ప్రగతి ఆలోచనలలో నెల్లూరుజిల్లా పేరే వినిపించకుండా పోతుంది.**

రాష్ట్ర విభజన తర్వాత ఆయా జిల్లాల నాయకులు తమ జిల్లాల అభివృద్ధి మీద దృష్టిపెట్టారు. విశాఖ జిల్లాకు సినీపరిశ్రమ తరలిపోయే అవకాశముంది. ఇక విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని అక్కడి నాయకులు బలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుండి సానుకూల సంకేతాలున్నాయి. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలు అన్ని విధాలా అభివృద్ధి చెందిన ప్రాంతాలు. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వంలో ఆ జిల్లాల నాయకులు కీలకపాత్ర పోషిస్తున్నారు. తమ ప్రాంతాలను ఇంకా అభివృద్ధి చేసుకునే లక్ష్యంతో వారు పోరాడుతున్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాలు కేంద్రంగా రాజధానిని నిర్మించే అవకాశముంది కాబట్టి అభివృద్ధి దానంతటదే జరుగుతుంది. ఇక గుంటూరుకు సమీపంలో ఉంది కాబట్టి ప్రకాశంజిల్లా కూడా కొంతవరకు అభివృద్ధి చెందే అవకాశముంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లా కావడం, ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమల ఉన్నందున చిత్తూరుజిల్లా అభివృద్ధిని ఎవరూ ఆపలేరు. వెనుకబడిన ప్రాంతంగా అనంతపురం జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తుంది. ప్రతిపక్షనేత వై.యస్.జగన్ సొంత జిల్లా కడపలో 'సెయిల్' వంటి ప్రతిష్టాత్మక ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆంధ్రరాష్ట్రానికి ఒకప్పుడు రాజధానిగా వున్న కర్నూలును ఇప్పుడు రాష్ట్రానికి రెండో రాజధానిని చేయాలని, అక్కడ హైకోర్టును ఏర్పాటు చేయాలని ఆ జిల్లా నాయకులు బలంగా కోరుతున్నారు.

కాని నెల్లూరు జిల్లా నాయకులే అభివృద్ధి పనుల విషయంలో గట్టిగా పోరాడలేకున్నారు. జిల్లాకు వచ్చిన వాటిని కూడా కాపాడుకునే ప్రయత్నం చేయలేకపోతున్నారు. గత యూపిఏ ప్రభుత్వంలోనే జిల్లాలోని దుగరాజపట్నం వద్ద కేంద్రప్రభుత్వం పోర్టును మంజూరు చేసింది. దీనికి గెజిట్ నోట్ కూడా విడుదలయ్యింది. గతంలో తిరుపతి ఎంపీగా వున్న చింతా మోహన్ రామాయపట్నంకు వెళ్ళిన పోర్టును పోరాడి నెల్లూరుజిల్లాకు తెప్పించగలిగారు. అయితే మళ్లీ ఈ పోర్టు నిర్మాణం మీద సందేహాలు మొదలయ్యాయి. దుగరాజపట్నం పోర్టుకు పర్యాటకశాఖ అనుమతులు లేవని, 'ఇస్రో' అభ్యంతరాలున్నాయని, దీనిని మళ్లీ రామాయపట్నం వద్దే ఏర్పాటు చేస్తారనే ప్రచారం జరుగుతుంది. కనీసం ఈ పోర్టును కాపాడుకునే ప్రయత్నం మీద కూడా జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు దృష్టిపెట్టడం లేదు. కనీసం దీనికి సంబంధించి ప్రకటనలు కూడా చేయడం లేదు. రాష్ట్ర విభజన నేపథ్యంలో మరెన్నో కేంద్ర సంస్థలను సీమాంధ్రలో నెలకొల్పాల్సి వుంది. ఈసారి అన్నింటిని ఒకే చోట కాకుండా వికేంద్రీకరించాలనే ఆలోచనలతో ఉన్నారు. మా జిల్లాలో ఐఐటి కావాలని, త్రిపుల్‌ఐటి కావాలని, ఎయిమ్స్ కావాలని ఆయా జిల్లాల నాయకులు డిమాండ్లు చేస్తున్నారు. మా జిల్లాలో ఈ కేంద్ర సంస్థ కావాలనిగాని, ఈ విద్యాసంస్థ, ఈ వైద్యసంస్థ కావాలనిగాని ఏ నాయకుడూ కోరడం లేదు. పోర్టు అనుబంధంగా ఎన్నో పరిశ్రమలను నెలకొల్పవచ్చు. ఆ దిశగా ఎవరూ ప్రయత్నాలు చేస్తున్న దాఖలాలు లేవు. అడగందే అమ్మయినా పెట్టదనే సామెత వుంది. దీనిని అర్థం చేసుకుని మన ప్రజాప్రతినిధులు స్పందించాల్సి వుంది.

# నా కల.. ఫలించింది!

## - 'లాయర్'తో మంత్రి నారాయణ గురువు నారాయణమూర్తి

- ఎంత కష్టం వచ్చినా తొణకడు.. బెణకడు
- అనుకున్నది సాధించేదాకా వదలడు
- పట్టుదలతోనే ఎదిగాడు.. విద్యావేత్తగా విఖ్యాతిగాంచాడు
- కలెక్టర్ కాలేకపోయినా... మంత్రి అయ్యాడు
- ఎవరినీ నొప్పించని తత్వం.. అదే నారాయణ మంచి మనస్తత్వం

*"ఎంత కష్టం వచ్చినా తొణకడు..బెణకడు, నిబ్బరంగా వుంటాడు. వినమ్రత-విధేయత అనేవి ఆయన సహజ గుణాలు. నిగర్వి.. నిరాడంబరుడు కూడా. దైవభక్తి, దేశభక్తి వున్న మంచి వ్యక్తి. అంతకన్నా మించి మృదుస్వభావి. అంతేకాదు, అహరహం కష్టించి పనిచేసే స్వభావం..ఎవరినీ నొప్పించని తత్వం ఆయనది. అంతేకాదు, ఎవరికైనా తనవంతు ఉపకారం చేస్తాడే కానీ, తానెవరికీ అపకారం చెయ్యడు... ఇదీ నారాయణ తత్వం.. మనస్తత్వం. జీవితంలో ఎన్నో ఆటుపోట్లను అధిగమించి, అంచలంచలుగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి, ఉన్నతశిఖరాలను అందుకున్న మా నారాయణ ఆత్మవిశ్వాసం చూస్తే ఒక్కోసారి నాకే ఎంతో ఆశ్చర్యమనిపిస్తుంది"... అంటూ ప్రముఖ విద్యావేత్త, జెవి నారాయణమూర్తి అన్నారు.*


శిష్యుడు డా॥ నారాయణతో గురువు నారాయణమూర్తి

నారాయణమూర్తిగారంటే ఎవరో కాదు..ఇటీవలే రాష్ట్ర పురపాలకశాఖ మంత్రిగా పదవిని పొందిన మన డాక్టర్ నారాయణకు సాక్షాత్తూ గురువుగారు. చిన్నతనంలో నారాయణను అక్కున చేర్చుకుని చదువు చెప్పారు. పాఠాలతో పాటు జీవితపాఠాలను కూడా బోధించారాయన. అందుకే వీరిద్దరికీ అంత అనుబంధం, ఆత్మీయానుబంధం. నెల్లూరులో వీరిని అప్పట్లో తెలిసినవారంతా నరనారాయణులనేవారు కూడా. అంతగా కలసిమెలసి వుండేవారు వీరిద్దరూ. నారాయణమూర్తిగారి కుటుంబంలో నారాయణ ఒక సభ్యుడనేదానికంటే, నారాయణమూర్తిగారి పెద్దకుమారునిలా వుండేవారనే చెప్పాలి. ఎంతోకాలంగా వీరిద్దరూ గురుశిష్యులుగా వున్నప్పటికీ, ఇప్పుడు నారాయణ గురువును మించిన శిష్యుడు కావడం, ఆ గురువుకు ఎనలేని సంతోషం కలిగిస్తోంది. నారాయణకు మంత్రి పదవి వచ్చిందని తెలిసి నారాయణ మూర్తిగారెంత ఆనందించారో చెప్పనలవి కాదు. మొదట సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. తనింట్లో పెరిగిన బిడ్డ ఇంతగా ఉన్నతంగా ఎదిగిపోయాడా అని అమందానందకందళిత హృదయంతో పొంగిపోయారు.. పరవశించిపోయారు. ఇంట్లో వున్న వారందరినీ పిలిచి, ఇదిగో నేనప్పుడే చెప్పలా.. మనవాడు ఏదో ఒకరోజుకి పవర్‌ఫుల్ మ్యాన్ అయిపోతాడని..నేను చెప్పినట్లే జరిగింది.. ఇపుడు చూడండి.. మన నారాయణ రాష్ట్ర మంత్రిగా స్థానం సాధించాడు.. ఏమనుకున్నారు నా శిష్యుడంటే... అంటూ ఆయన ఎంతో సంబరపడిపోయారు. ఆయన ప్రతి మాటలోనూ తన శిష్యుడు మంచి ఉన్నతస్థాయికి రావడం పట్ల వున్న ఆనందాన్ని వ్యక్తపరిచారు. 'ఒక గురువుకు జీవితంలో ఇంతకన్నా గొప్ప సంతోషమైన విషయం ఏముంటుంది'.. అంటూ ఆయన ఆనంద భాష్పాలు రాల్చారు. డాక్టర్ నారాయణకు మంత్రి పదవి వచ్చాక, ఆయన గురువైన నారాయణమూర్తి గారిని 'లాయర్' కలసినప్పుడు, నారాయణ చిన్నతనం ఎలా జరిగింది, ఆయనెంత కష్టపడి చదువుకుని విద్యావేత్తగా రాణించింది.. ఆయన తత్వం, మనస్తత్వం ఎలాంటివి... వగైరా విషయాలెన్నో అరమరికలు లేకుండా చెప్పారు. అవే ఇవి... నేను 1958 ప్రాంతంలో నెల్లూరుకు వచ్చి ట్యూషన్లు చెప్తుండేవాడిని. అప్పట్లో నాకు దివంగత తుంగా రాజగోపాలరెడ్డి గారు(లాయర్ వ్యవస్థాపకులు), విఆర్ కాలేజీ మేనేజర్‌గా వున్న టి.వి.రమణారెడ్డిగారు నాకు బాగా పరిచయస్తులు. వారి ప్రోత్సాహంతో అండదండలతో ట్యూషన్లు చెప్తూండేవాడిని. తుంగా రమణారెడ్డి గారి ఇంటిపక్కనే నారాయణ తల్లిదండ్రులు పొంగూరు సుబ్బరామయ్య, సుబ్బమ్మలు నివసించేవారు. వారిది పేద కుటుంబం. సుబ్బరామయ్య బస్ కండక్టర్‌గా పని చేసేవారు. వారిద్దరి మొదటి కుమారుడు నారాయణ. సుబ్బమ్మగారి తమ్ముడు వెంకయ్య కూడా నా వద్దనే చదువుకుంటుండేవాడు. అయితే, వెంకయ్య మిలిటరీలో చేరాడు. ఈ నేపథ్యంలో అటు తుంగా రమణారెడ్డిగారు, ఇటు వెంకయ్య ఇద్దరూ నారాయణకు ఎలాగైనా మంచి చదువు చెప్పించాలని నారాయణను నా వద్దకు పంపారు. అప్పటికి నారాయణ 8వ తరగతి పాసైవున్నాడు. నారాయణను చదివించే బాధ్యత నాకు వదిలిపెట్టండి..కండక్టర్ కొడుకును కలెక్టర్‌ను చేస్తానని అప్పట్లో నేను ధీమాగా వారికి చెప్పాను కూడా. చెప్పడమే కాదు, అందుకు తగ్గట్లుగా నారాయణ కూడా ఎంతో శ్రద్ధాసక్తులతో చదువుకునేవాడు. చిన్నతనం నుంచి కూడా నారాయణలో గురుభక్తి ఎక్కువ. తల్లిదండ్రులంటే ఎనలేని గౌరవం. కష్టాలకు వెరవని మనస్తత్వం. ఎంత కష్టమైన పనైనా సాధించి తీరాలనే తత్వం..అవన్నీ కలసి ఆయనను మరింత స్థాయికి తీసుకువెళ్ళాయి. ఎస్వీయులో ఎమ్మెస్సీలో గోల్డ్‌మెడల్ సాధించాడు. హరానాథపురంలో చిన్న పూరింట్లో నారాయణ వుండేవాడు. ఆ తర్వాత విఆర్‌సిలో కొంతకాలం లెక్చరర్‌గా పనిచేశాక, సొంతంగా హరనాథపురంలోనే 'నారాయణ కోచింగ్ సెంటర్' ప్రారంభించాడు. అదే నారాయణ జీవిత విజయాలకి కారణమైంది.

నారాయణ విద్యాసంస్థల అధిపతిగా నారాయణ కీర్తి ప్రఖ్యాతమైంది. అహోరాత్రులూ కష్టించి విద్యాసంస్థల ఉన్నతికి నారాయణ చేసిన కృషి అనితర సాధ్యమైనది. సమాజాన్ని విద్యాపరంగా అభివృద్ధి చేస్తే, సమాజం అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధిస్తుందని నారాయణ ప్రగాఢ విశ్వాసం.

అందుకోసం రాత్రీపగలూ అనే తేడా లేకుండా కష్టించి పనిచేసేవాడు. దేశంలోనే దాదాపు మూడు వందలకు పైగా విద్యాసంస్థలు స్థాపించి, లక్షలాది మంది విద్యార్థులకు విద్యనందిస్తూ, వేలాదిమంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బందికి జీవనభృతి కల్పిస్తూ, విద్యారంగంలో నారాయణ విద్యాసంస్థల కీర్తిబావుటాను జాతీయస్థాయిలో రెపరెపలాడిస్తూ వుండడం చూస్తే..మన నారాయణ ఇంత ఎత్తుకు ఎదిగాడా?..అని నాలో నేను గర్విస్తుంటాను కూడా. తాను ఎంత ఎత్తుకు ఎదిగినా, అందరిలోనూ ఎంతో వినయంగా, ఒద్దికగా ఒదిగే వుండే మంచి మనస్తత్వం నారాయణది. ఎవరితోనైనా సరే ఎలాంటి భేషజం లేకుండా వినమ్రంగా మాట్లాడడం ఆయన నైజం. అందుకే నారాయణ అంటే ఎవరికైనా ఇష్టం. ప్రత్యేకించి తాను ఎంతటి ఉన్నతస్థానంలో వున్నా, తనకు చదువు చెప్పిన గురువులను, చిన్ననాటి స్నేహితులను ఆయన ఏనాడూ విస్మరించలేదు. తాను చదువుకున్న నెల్లూరులోని ఓఆర్ఎం స్కూల్ (ఓరుగంటి రుక్మిణమ్మ స్మారక పాఠశాల)కు నారాయణ మూడంతస్తులతో అందమైన భవనాన్ని నిర్మించారు. 1 నుంచి 5వ తరగతి దాకా చదువుకునే పిల్లలకు ఇక్కడ ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాడు. అంతేకాదు, ఒక మంచి స్నేహితునిగా కూడా నారాయణ

(మిగతా 10వ పేజీలో)






## చెన్నైకి వెంకయ్య




భారతీయ జనతాపార్టీ అఖండ విజయంలో భాగస్వామి కేంద్ర పట్టణాభివృద్ధి, పార్లమెంటు వ్యవహారాలు, పట్టణ గృహ నిర్మాణ శాఖల మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు జూన్ 21వ తేదీ చెన్నై రానున్నారు. శనివారం ఉదయం 10గంటల 30నిముషాలకు చెన్నై ఎయిర్‌పోర్టులో ఆయన దిగుతారు. అక్కడ నుండి ఊరేగింపుగా బయలుదేరి భారతీయ జనతాపార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ జరిగే కార్యక్రమాలు, సమావేశాలలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4గంటలకు చెన్నై యం.ఆర్.సి.నగర్‌లోని, చెట్టినాడు విద్యాశ్రమం ఎదురుగాగల ఇమేజ్ ఆడిటోరియంలో జరిగే ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు. సమావేశంలో వెంకయ్య ఆప్తులు ఆత్మీయులు ఆయనకు అభినందన సత్కారాన్ని చేయనున్నారు.

## ఓఎస్‌డిగా సత్యకుమార్!



కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు మరియు పట్టణాభివృద్ధి శాఖామాత్యులు యం.వెంకయ్యనాయుడు వ్యక్తిగత కార్యదర్శి వై.సత్యకుమార్‌ను కేంద్ర ప్రభుత్వం ఓఎస్‌డిగా నియమించింది. ఇది ఐఏఎస్ అధికారి హోదా! వెంకయ్యకు ఏ టు జడ్ సత్యనే చూసుకుంటాడు. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన సత్య 1992 నుండి వెంకయ్యకు దగ్గరయ్యారు. 1994 నుండి ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేయసాగాడు. దాదాపు ఈ 20ఏళ్ల కాలంలో వెంకయ్యనాయుడు దేశమంతటా ఎంత తిరిగాడో సత్య కూడా అంతే తిరిగి ఉంటాడు. అప్పుడప్పుడు వెంకయ్య వెనుక ఆయన నీడన్నా కనిపించదేమోగాని ఆయన వెనుక సత్య కనిపించని క్షణమంటూ ఉండదు. వెంకయ్యకు సంబంధించిన చాలా పనులు సత్యనే స్వయంగా పర్యవేక్షిస్తూ తన గురువుకు చాలా వరకు పనిభారం తగ్గిస్తూ ఉంటాడు. బీజేపీకి సంబంధించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నాయకులు వెంకయ్యనాయుడు బిజీగా ఉంటారు కాబట్టి ఆయన కంటే కూడా సత్యతోనే ఎక్కువుగా టచ్‌లో ఉంటారు. సత్య పక్కన వుంటే వెంకయ్యకు కూడా కొండంత ధైర్యంగా ఉంటుంది. తనను నీడలా వెన్నంటి వుంటూ నమ్మకానికి ఐఎస్ఐ మార్కులా నిలిచిన సత్యకు తగిన గౌరవమే కల్పించాడు వెంకయ్య. కంగ్రాట్స్ సత్య..!




## ఒక శకం ముగిసింది

పెద్దాయన నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మృతితో జిల్లాలో ఒక రాజకీయ తరం ముగిసింది. నేదురుమల్లి వంటి కాంగ్రెస్‌వాదులు ఇప్పుడు చాలా అరుదుగా ఉన్నారు. నేదురుమల్లి ఒక రాజకీయ పరిశ్రమ. ఎందరో నాయకులను తయారు చేసాడు. జిల్లా నుండి రెండో ముఖ్యమంత్రి ఆయన. నెల్లూరులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి.

*బి. ఆర్. శాలి,* కావలి.

## చేజేతులా చేసుకున్నదే!

జగన్ కోసం క్రైస్తవులు, ముస్లింలు, రెడ్లు, కొంత వేరే సామాజిక వర్గాల ప్రజలు తపించారు. అపరిపక్వ విధానాలతోనే జగన్ దెబ్బతిన్నాడు. తిరుమల విషయంలో వై.యస్. కుటుంబం తప్పు చేస్తుంది. దానికి ఫలితాలు ఈ విధంగానే ఉంటున్నాయి. జగన్‌తో రాష్ట్రంలో బైబిల్ రాజ్యం వస్తుందని భావించిన బ్రాహ్మణ, వైశ్య, శాఖాహార సున్నిత వర్గాలు చంద్రబాబుకు మద్దతు పలికాయి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## రాజధానిపై ఖర్చు దండగ

అందమైన రాజధాని నిర్మాణమంటూ కోట్లాది రూపాయలు భవనాల నిర్మాణానికి తగలేయడం సముచితం కాదు. అసలే రాష్ట్రం అప్పుల్లో, ఆర్థికలోటులో వుంది. వచ్చిన నిధులను మౌలిక సదుపాయాలకు, అభివృద్ధికి, పునరుత్పత్తికి ఖర్చుచేయాలి. ఏలూరు నుండి ఒంగోలు వరకు సీట్లు భర్తీకాక నడవలేని స్థితిలో ఎన్నో ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయి. ప్రభుత్వమే వీటిని కొనవచ్చు. కాలేజీ యాజమాన్యాలు కూడా నష్టాల నుండి బయటపడతాయి. భవనాలు కట్టే పనిలేకుండా, ఆ సమయాన్నంతా పరిపాలనపై కేంద్రీకరించవచ్చు.

*జి. మనోహర్,* ఒంగోలు.

## కోనేరును పట్టించుకోరా?

నెల్లూరు, మూలాపేటలోని కోనేరును అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దానిని శుభ్రపరిచే చర్యలు తీసుకుంటే మంచిది.

*ఇ. రామాంజనేయులు,* నెల్లూరు.

## 'ప్రభా'తం

# వికసించిన స్నేహం



**భూటాన్‌లో ఆ దేశపు పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించే అరుదైన అవకాశం భారత ప్రధాని మోడీకి రావడం, అక్కడ మోడీ అత్యద్భుతంగా ప్రసంగించి భారత్ ప్రతిష్టను, గౌరవాన్నీ మరింతగా ఇనుమడింపజేయడం నిజంగానే దేశ ప్రజలందరికీ కూడా ఒక గౌరవం.**

దీటైన నాయకత్వమే దేశానికి మేలు చేస్తుంది. మాటలు చెప్పి మరచిపోవడం కాక, చెప్పింది చేసి చూపించే చిత్తశుద్ధి గల నాయకుడెప్పుడూ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం పొందుతూనే వుంటాడు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోగల సత్తా వున్న మోడీ లాంటి మహానేతలకే అది సాధ్యమవుతుంది. అందులోనూ ఇరుగుపొరుగు దేశాలతో సఖ్యత అంటే ఎంతో సున్నితమైన అంశం కూడా. అయినప్పటికీ ఎంతో ధీరగంభీరంగా, భారత ప్రధాని నరేంద్రమోడీ తన తొలి విదేశీ పర్యటన భూటాన్‌లో జరిపి ఎంతో గౌరవాన్ని అందుకున్నారు. ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలు పెంపొందించుకోవడం తమ అభిలాష అనీ, భారత్-భూటాన్ దేశాల మధ్య వున్న చారిత్రక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు తాము కట్టుబడి వున్నామని మోడీ స్పష్టం చేసి, అక్కడి నేతలు, ప్రజల మనసులను ఎంతగానో ఆకట్టుకున్నారు. భారత ప్రజల ఆశలు ఆకాంక్షలకు ప్రతినిధిగా, ఎన్నదగిన మహానేతగా ప్రధాని నరేంద్ర మోడీ తొలి విదేశీ పర్యటన యావత్‌ప్రపంచాన్నీ ఆకర్షించింది. రెండు రోజుల భూటాన్ పర్యటనలో భాగంగా థింపూలోని భూటాన్ పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి ప్రధాని నరేంద్రమోడీ చేసిన ప్రసంగం భారతీయ హృదయానికి దర్పణంగా నిలిచింది. ఇరుగు పొరుగుదేశాలతో మైత్రీభావం పెంపొందించుకోవడం, ఒకరికొకరు స్నేహంతో మెలగడం, అవసరమైన సాయం అందించుకోవడం వంటివన్నీ అందరూ ఎంతో సంతోషంతో ఆహ్వానించదగ్గ విషయాలే. ఇరుగుపొరుగు వారితో కలసిమెలసి హాయిగా జీవించడమన్నది భారతీయ సంప్రదాయంలోనే వుంది. అది మన సంస్కారాన్ని ప్రతిబింబిస్తుంది. మోడీ వంటి మహోన్నత నేతకు ఇవన్నీ కరతలామలకాలే. యోగభూమిగా, దైవభూమిగా, అన్నిటికీ మించి శాంతి దేశంగా ప్రపంచంలో ఖ్యాతి గన్న భరతభూమికి సేవలందించడమంటే భారతమాతకు సేవ చేయడమేనన్నది ఆయన ఆశయం. భారత ప్రజలు కన్న కలలను సాకారం చేయాలన్నదే ఆయన ఆకాంక్ష. ఈ నేపథ్యంలో, ప్రధాని మోడీ భూటాన్ పర్యటన ఎంతో విశేషమైనది. పొరుగుదేశాలతో భారత్ ఎల్లప్పుడూ సత్సంబంధాలు కోరుకుంటుందని, భారత్‌లో స్థిరమైన, బలమైన ప్రభుత్వం వుంటేనే భూటాన్‌కు మేలు జరుగుతుందని, భారత్ అభివృద్ధి చెందితే భూటాన్‌కు మంచి మేలు కలుగుతుందని, అందువల్ల ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను కాపాడుకుంటూ, మరింత బలపరచాల్సిన అవసరం వుందని ప్రధాని మోడీ తన ప్రసంగంలో పిలుపునివ్వడం ద్వారా ఇరుగుపొరుగు దేశాల పట్ల తాము అనుసరించదలచిన మైత్రీభావాన్ని స్పష్టంగా చాటారు. సామాన్యుల హక్కుల పరిరక్షణలో భూటాన్ రాజకుటుంబం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని, ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ద్వారా పటిష్టమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలను భూటాన్ పాదుకొల్పిందని ప్రశంసిస్తూ అక్కడి ప్రజల మనసులను ఆకట్టుకున్నారు. మోడీ సుమారు 45 నిమిషాల పాటు ప్రసంగించగా, ఆయన ప్రసంగానికి సభ కరతాళధ్వనులతో మార్మోగిందంటే మోడీ ఎంత గాఢంగా, ఎంత ఆత్మీయంగా ప్రసంగించారో తేటతెల్లమవుతుంది. సమాజానికి విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులను అందించే ఏ దేశమైనా పటిష్ట ప్రజాస్వామంతో ఫరిడవిల్లుతుందని ఆయన అన్నారు. ఎంత గొప్ప మాట ఇది. మొత్తంగా, మోడీ ప్రసంగం ఆద్యంతం ఎంతో హృద్యంగా, స్నేహాభివృద్ధికి చిహ్నంగా వుండింది కనుకనే, ఆయన ప్రసంగానికి అక్కడున్న నాయకులు, ముఖ్యులు అందరూ హర్షధ్వానాలు చేశారు. మోడీ ప్రసంగంలోని వాగ్ధాటితో పాటు, ఆయన మాటల్లోని నిబద్ధత, నిజాయితీ ఆ ప్రసంగంలో ప్రతిధ్వనించాయి కనుకనే ఆ దేశాధినేతలు సైతం మోడీని ఎంతో మెచ్చుకున్నారు. ఆయన ప్రసంగానికి సంతోషంతో కరతాళధ్వనులు చేశారు. ఈ పర్యటనతో భారత్-భూటాన్‌ల హృదయసీమల్లో స్నేహసుమాల పరిమళాలు మరింతగా వెల్లివిరిసినట్లయింది. ఇక్కడ మరో ముఖ్యమైన అంశమేమిటంటే.. గతంలో ఎన్నడూ లేని విధంగా మోడీ ఇరుగుపొరుగు దేశాల మైత్రి మరింత ఫరిడవిల్లేలా వుండేందుకు ఇండియా-భూటాన్ హిమాలయ ప్రాంతాల్లో క్రమం తప్పకుండా స్పోర్ట్స్‌మీట్ నిర్వహించాలని ప్రతిపాదించడం. ఇరుగు పొరుగు దేశాల స్నేహం మరింతగా పెంపొందేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. క్రీడాస్ఫూర్తితో మరింత మైత్రీభావాన్ని, ఇరుదేశాల మధ్య ఆహ్లాదకరమైన, ఆనందభరితమైన వాతావరణాన్ని పెంపొందించు కోవాలనే ఆకాంక్ష ఇందులో ప్రతిఫలిస్తోంది. భారత ప్రజల ఆశలు.. ఆకాంక్షలకు ప్రతినిధిగా.. భారత ప్రధానిగా నరేంద్రమోడీ పదవీప్రమాణ స్వీకార మహోత్సవం రోజున కూడా సార్క్ దేశాల ప్రతినిధులను, ముఖ్యనేతలను ఆహ్వానించడం ఒక సత్సంప్రదాయంగా ప్రపంచ వ్యాప్తంగా అందరి ప్రశంసలూ అందుకుంటే, తాజాగా భూటాన్‌లో ఆ దేశపు పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించే అరుదైన అవకాశం భారత ప్రధాని మోడీకి రావడం, అక్కడ మోడీ అత్యద్భుతంగా ప్రసంగించి భారత్ ప్రతిష్టను, గౌరవాన్నీ మరింతగా ఇనుమడింపజేయడం నిజంగానే దేశ ప్రజలందరికీ కూడా ఒక గౌరవం.

అంతేకాదు, మోడీని ఎంతో ఘనంగా స్వాగతించడం భారత్ పట్ల భూటాన్‌కు వున్న సమున్నతమైన గౌరవానికి నిదర్శనం. ఏదేమైనా..ఇరుగు పొరుగు దేశాల సఖ్యతకు, స్నేహానికి, సుహృద్భావ వాతావరణానికీ బాటలు వేసే ఇలాంటి పర్యటనలు సదా మంచి ఫలితాలనే ఇస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అదేవిధంగా, భారత్‌తో భూటాన్ స్నేహసంబంధాల పురోభివృద్ధికి మోడీ చేసిన ఈ తొలి విదేశీ పర్యటన ఎంతగానో దోహదం చేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

## 'అంతర్'జాతీయం

- భారత సంతతికి చెందిన బ్రిటీష్ శాస్త్రవేత్తలకు రెండు అరుదైన పురస్కారాలు లభించాయి. భౌతిక శాస్త్రవేత్త తేజేందర్ విర్దీకి బ్రిటన్ రాణి ఎలిజిబెత్ అత్యంత ప్రతిష్టాత్మక గౌరవ నైట్‌హుడ్‌ను ప్రకటించారు. అలాగే జాతీయ అంతరిక్ష అకాడమీకి డైరెక్టర్‌గా వున్న అనుపమ్‌ఒఝాకు 'ఆర్డర్ ఆఫ్‌ది బ్రిటీష్ ఎంపైర్' ప్రకటించారు.
- అమెరికా జాతీయ సైన్స్ బోర్డ్ ఆఫ్ ది నేషనల్ సైన్స్ ఫౌండేషన్‌లో సభ్యుడిగా భారత అమెరికన్ శాస్త్రవేత్త సేథురామ్ పంచనాథన్‌ను నియమించారు. పంచనాథన్ గతంలో చెన్నైలో డాటా కమ్యూనికేషన్ ఇంజనీర్‌గా పని చేసారు.
- నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘిస్తే ఎదుర్కోగల సత్తా భారత సైనిక బలగాలకు ఉందని కేంద్ర రక్షణశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. ఈ నెల 14న జైట్లీ జమ్మూ కాశ్మీర్‌లో పర్యటించారు. నియంత్రణ రేఖ వెంబడి పరిస్థితిని ఆయన సమీక్షించారు.
- రక్తదాన కార్యక్రమాలకు యువత నేతృత్వం వహించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. ఈ నెల 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆయన తన సందేశాన్ని ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తూ రక్తదానం చేయడమంటే సమాజానికి సేవ చేయడమేనని పేర్కొన్నారు.
- న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులు, ఆదేశాల వెనుక ఉండే కారణాలను సమాచార హక్కు చట్టం క్రింద కక్షిదారులకు వెల్లడించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.
- దేశంలో ప్రతి ఏటా 30లక్షల మంది పట్టాలు తీసుకుని బయటకు వస్తుంటే వారిలో సగం మందికే ఉద్యోగ నైపుణ్యాలు ఉంటున్నాయని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి స్మృతి ఇరానీ పేర్కొన్నారు. ఆదివారం పూణేలోని సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ పట్టభద్రులకు ఉపాధితో ముడిపెట్టడానికి మానవవనరుల శాఖ ద్వారా ఆన్‌లైన్ అనుసంధాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు.
- సభా గౌరవాన్ని కాపాడేందుకు తప్పుచేసిన సభ్యులపై అవసరమైతే కఠినచర్యలకు వెనుకాడనని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ పేర్కొన్నారు. పిటిఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తొలిసారిగా ఎన్నికైన సభ్యులు ఈ సభలో ఎక్కువగా వున్నందున శిక్షణకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- కఠిన నిర్ణయాలతోనే ప్రగతి. – ప్రధాని నరేంద్ర మోడీ.
**వ్యాఖ్య :- *మీరు మరీ అంత కఠినంగా వుంటే ప్రజలు పాలకుల పట్ల ఇంకా కఠినంగా తయారవుతారేమో!***

వార్త :- ఆకాశ హార్మ్యాలతో రాజధాని. – చంద్రబాబుతో రాజధాని కమిటీ భేటీలో చర్చ.
**వ్యాఖ్య :- *సింగపూర్ లాంటి రాజధాని అంటే ఇదేనా?***

వార్త :- ఋణమాఫీ పథకాన్ని వెంటనే అమలు చేయాలి. – సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు.
**వ్యాఖ్య :- *ఋణమాఫీ రద్దు అంటే... కాఫీ తాగినంత సులభం అనుకుంటున్నారా?***

వార్త :- పోలవరం ఆర్డినెన్స్ రద్దు చేయాలి. – కేసీఆర్.
**వ్యాఖ్య :- *అసలు రాష్ట్ర విభజననే రద్దు చేస్తే పోలా?***

వార్త :- ప్రజలపై పైసా భారం మోపం. – ఆర్థికమంత్రి యనమల.
**వ్యాఖ్య :- *అల్లాఉద్దీన్ అద్భుత దీపమేమన్నా దొరికిందా?***

వార్త :- అటవీ సంపదను కాపాడుతాం. – అడవుల మంత్రి బొజ్జల.
**వ్యాఖ్య :- *ఇంకేం మిగిలిందని కాపాడ్డానికి.***

వార్త :- తెలుగు భాషాభివృద్ధికి కృషి. – మంత్రి పల్లె రఘునాథరెడ్డి.
**వ్యాఖ్య :- *ముందు అందరు మంత్రుల చేత సంపూర్ణంగా తెలుగులో మాట్లాడేలా చేయండి.***

వార్త :- ఋణమాఫీకి మేం అనుకూలం కాదు. – ఆర్‌బిఐ.
**వ్యాఖ్య :- *మీకు ఓట్లతో అవసరం లేదుగా, అలాగే చెబుతారు.***

వార్త :- పారదర్శక పాలన అందిస్తాం.
**వ్యాఖ్య :- *ఏదో ఒకటి... ముందు పాలన అందించండి.***

వార్త :- వర్షాల కోసం వరుణ జపాలు. – దేవాదాయశాఖ మంత్రి మాణిక్యరావు.
**వ్యాఖ్య :- *కప్పల పెళ్లిళ్లు, గంగమ్మ జాతరలు వద్దా?***

# ఈ మండే ఎండలు మనకేం చెప్తున్నాయి?



విస్తారమైన వరిపొలాలతో, పచ్చని పొలాలతో కళకళలాడే మన జిల్లా ఈ ఎండల దెబ్బకు ఎందు రొట్టెముక్కలా అయిపోయింది. భగ్గుమనే ఎండలతో, ఉక్కపోతలతో, వడగాలులతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. గతంలో ఓ అయిదారేళ్ళ క్రిందట 30 నుంచి 35 డిగ్రీల దాకా ఉష్ణోగ్రత వుండేది. ఇప్పుడు ఎండాకాలమంటేనే 35 డిగ్రీల నుంచి ప్రారంభమా అన్నట్లు 45 డిగ్రీల దాకా పెరిగిపోతోంది. ఈ వేసవితో జనం పడుతున్న బాధలు అన్నిన్ని కావు. ముఖ్యంగా నెల్లూరు నగరం పెనం మీద పడినట్లు మలమల మాడిపోతోంది. నగరంలో బాగా ఏపుగా పెరిగివున్న వందల ఏళ్ళ నాటి వృక్షాలను రోడ్ల వెడల్పు పేరుతో తొలగించేయడం వల్ల నగరంలోని ప్రధాన ప్రాంతాలైన ట్రంకురోడ్డు, వి.ఆర్.సి సెంటర్, వినాయక మహల్ సెంటర్, రంగనాయకులపేట, స్టోన్‌హౌస్‌పేట, పొగతోట, బాలాజీనగర్, ఏసి నగర్, దర్గామిట్ట, పొదలకూరురోడ్డు ప్రాంతం ఇలా ఎక్కడ చూసినా చెట్లు లేకపోవడంతో, చల్లని నీడ కరువైంది. చల్లదనం అన్నది కనుమరుగైపోయింది. ఉక్కపోతలతో, వడగాలులతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఏడాదిడేది ఎండలు ఇంత తీవ్రంగా వుంటున్నాయంటే కారణం ఏమిటో మనమంతా ఆలోచించుకోవాల్సిన తరుణం ఇదే. చుట్టూ వున్న వాతావరణం మారిపోయింది. పచ్చదనం కరువైపోయింది. చెట్టూ చేమా వుంటేనే చల్లని వాతావరణం వుంటుందన్నది అందరికీ తెలిసిన సత్యమే. అయినా, చుట్టూతా వున్న చెట్లను నరికేసుకుని, ఎండను మనమే ఆహ్వానిస్తున్నాం. నగరం చుట్టూ వున్న పంటపొలాలు కూడా ప్లాట్లుగా మారిపోతున్నాయి. అంగుళం కూడా ఖాళీ లేకుండా భూములన్నీ వ్యాపారాత్మకంగా మారిపోతున్నాయి. మనది సముద్ర తీర ప్రాంతమైనప్పటికీ, అక్కడ కూడా ఇదే దుర్గతి. చెట్లు కొట్టేసుకుని, పొలాలను రొయ్యలగుంటలుగానో, చేపల గుంటలుగానో మార్చేసుకుంటున్నాం. కల్పవృక్షాలుగా పేరుపొందిన తాటిచెట్లు కూడా ఇప్పుడు కనుమరుగైపోయాయి. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. పర్యావరణం కాపాడుకోకుంటే మాత్రం ఈ దుస్థితి మరింత దుర్గతిగా మారిపోతుంది. చెట్లను నరకడం మానేసి, పెంచడం అలవాటు చేసుకోవాలి. ప్రతి ఇంటి ముందు, రోడ్డు మార్జిన్‌లలోనూ మొక్కలు నాటుకోవాలి. ఎక్కడ చూసినా పచ్చని చెట్లు కళకళలాడుతూ వుంటే, ఎంత ఎండ వచ్చినా, ఇప్పటి వేడి వుండదు. ఇక కొద్దిరోజుల్లో వాతావరణం మారిపోతుంది. నైరుతీ రుతుపవనాలు వస్తాయి. గత ఒకటి రెండు రోజులుగా ఆ ప్రభావంతో కాస్త చల్లదనం కనిపిస్తోంది. వానలు కురిసే పరిస్థితి కూడా ఈ సారి ఆశాజనకంగానే వుండవచ్చని కోరుకుందాం. చల్లని చినుకులు పడగానే మనకు ముందుగా గుర్తుకు రావాల్సిన సంగతి.. మొక్కలు నాటడమే. ఎక్కడ అనువైన స్థలం దొరికితే అక్కడల్లా మొక్కలు నాటుకుంటూపోతే, వాటిని కొద్దికాలం పరిరక్షిస్తే చాలు. వృక్షో రక్షతి రక్షితః అన్నట్లు.. వృక్షాలను మనం రక్షించుకుంటే అవి మనల్ని రక్షిస్తాయి. చెట్లను పరిరక్షించుకోవడం ద్వారా భావితరాల వారికి కూడా చల్లటి నీడనిచ్చే భాగ్యం మనకు లభిస్తుంది. ఈ మండే ఎండలు ఇప్పుడు మనకు ఆ కర్తవ్యాన్నే గుర్తు చేస్తున్నాయి. కనుక, ఎవరూ మరచిపోవద్దు. వచ్చే ఏడాది కూడా ఇలాగే ఎండల ధాటికి విలవిలలాడవద్దు. ఈ ఎండలు మనకు చెప్పేది అదే..చెట్లను నాటండి..పర్యావరణాన్ని కాపాడండి.. ఎండలకు మలమలా మాడకండి.. హాయిగా చల్లని నీడలో జీవనం సాగించండి.. పర్యావరణాన్ని కంటికి రెప్పలా కాపాడుకోండి...అంటూ ఈ ఎండలు మనకు బాధ్యతలను గుర్తుచేస్తున్నాయి. ఆచరించడం మన చేతుల్లోనే వుంది మరి!...

## రవాణాశాఖ టెక్నికల్ అసోసియేషన్



రాంప్రసాద్ | సీతారామిరెడ్డి | మురళీమోహన్

రవాణాశాఖ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన బ్రేక్‌ఇన్స్‌పెక్టర్ కె.సీతారామిరెడ్డి ఎన్నికయ్యారు. 13జిల్లాల సీమాంధ్ర రవాణా టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశం మంగళవారం విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. అలాగే అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా నెల్లూరు ఆర్టీవో రాంప్రసాద్, కో-ఆర్డినేటర్‌గా బ్రేక్ ఇన్స్‌పెక్టర్ మురళీమోహన్‌లను ఎన్నుకున్నారు.

## జిల్లా ప్రజావాకర్స్ వితరణ



నెల్లూరు దర్గామిట్టలోని జిల్లా ప్రజాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా ప్రజావాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న పేదపిల్లలకు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. సంఘ సభ్యుల సహకారంతో రూ.5000/- 6, 7 తరగతులు చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో బిరుదవోలు రామిరెడ్డి, మెట్టు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి సుబ్బరాయుడు, సభ్యులు శ్రీధర్, ప్రసాద్, వాసుదేవరావు, పద్మాసిని, ఏబినైజరు, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.


**ADMISSIONS - 2014**

**B.E/ B.Tech**
(All Branches)

Chennai Top Colleges

Konda Reddy

098416 05100 (TN)


## ఎర్రచందనం తుప్ప వదలనుంది!



అటవీభూముల్లో వున్న విలువైన బంగారం ఎర్రచందనం. ఇంతకాలం స్మగ్లర్లు వాటిని కొట్టేసి విదేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లు సంపాదించుకుంటుంటే, కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు వాళ్లు విసిరిన ఎంగిలిమెతుకులను నాకుతూ ఎర్రచందనం అక్రమరవాణాకు సహకరిస్తూ వచ్చారు. అటవీశాఖ, పోలీసు శాఖల దాడుల్లో వందల టన్నుల ఎర్రచందనం పట్టుబడినా అది డిపోలలోనే తుప్పుపడుతూ రాగా, స్మగ్లర్లు మాత్రం అక్రమంగా పంపిన ఎర్రచందనంకు కోట్లాదిరూపాయలు రాసాగాయి. ఒక్క నెల్లూరుజిల్లా నుండే వందలకోట్ల విలువైన ఎర్రచందనం విదేశాలకు తరలిపోయింది. గత ప్రభుత్వంలో అయితే ఎర్రచందనం రవాణాకు అడ్డు అదుపు లేకుండాపోయింది. స్మగ్లర్లు పేట్రేగిపోయి అటవీశాఖ అధికారులపైనే దాడులకు తెగబడ్డారు.

ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం వచ్చింది. ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపే దిశగా ఉచ్చు బిగిస్తుంది. ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని పసిగట్టిన అధికారులు బడా స్మగ్లర్ల జాబితాను తయారుచేస్తున్నారు. అటవీశాఖాధికారులు ఎర్రచందనం అక్రమరవాణాను పూర్తిగా అరికట్టి, దాడుల్లో పట్టుబడి గోదాముల్లో వున్న విలువైన ఎర్రచందనం దుంగలను వేలానికి పెట్టే ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఆదూరుపల్లి, వెంకటగిరి, ఉదయగిరి, ఆత్మకూరు గోదాముల్లో దాదాపు 2వేల టన్నుల ఎర్రచందనం వుంది. దీనిలో 800టన్నులకు వేలం పాటలు నిర్వహించేందుకు అటవీశాఖ అధికారులు అనుమతి పొందారు. మిగతా 1200టన్నులను కూడా గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించనున్నారు. వేలం పాటల్లోగాని, టెండర్లలోగాని వివిధ దేశాలకు చెందిన కంపెనీలు పాల్గొనే అవకాశాలున్నాయి. ఈమేరకు వెబ్‌సైట్లో ఎర్రచందనం దుంగల ఫోటోలు, ఇతర వివరాలు పెట్టారు. వేలం పాటలు, టెండర్ల ద్వారా కోట్లాదిరూపాయలు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.


శ్రీరస్తు | శుభమస్తు | అవిఘ్నమస్తు

వివాహ మహోత్సవ ఆహ్వానము



కీ॥శే॥ **చేశెట్టి రమేష్‌బాబు** (CVG Pipes, Gudur, Ex-Surpanch, Nellatur)
& **శ్రీమతి జమునారాణి** (Ex-Municpal Councellor, Gudur)
దంపతుల జ్యేష్ఠపుత్రుడు

చి॥ **చేశెట్టి పవన్‌కుమార్**, M.S. (London)


చి॥ల॥సౌ॥ **ప్రియాంక**, M.S. (London)

ఆదివారం తేది. 22-06-2014, ఉదయం గం.7-20ని॥ల నుండి
గం.9-32 వరకు సుమూహూర్తము నిశ్చయించడమైనది.

కళ్యాణ వేదిక
**అతిథి ఫంక్షన్‌హాల్, ఏ/సి**
ద్వారకా ఫంక్షన్‌హాలు ఎదురుగా, ఆర్యమైసమ్మ,
బండ్లగుడ జాగీర్, లంగర్‌హౌజ్, హైదరాబాద్.

రిసెప్షన్
సోమవారం తేది. 23-06-14 రా॥ 7.00గం.లకు
సి.ఆర్.రెడ్డి కళ్యాణ మండపము
షిరిడిసాయినగర్, గూడూరు, నెల్లూరుజిల్లా.

కావున శ్రేయోభిలాషులు, స్నేహితులు మరియు బంధుమిత్రులు
అందరూ విచ్చేసి ఆశీర్వదించ ప్రార్థన.



ఇట్లు: తమ్ముడు
**చేశెట్టి మోహన్ వంశీకృష్ణ**, B.E., MBA
గూడూరు.

# నెల్లూరు కబుర్లు

## వెంకయ్య కోసం నెల్లూరు ఎదురుచూపు




కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన యం.వెంకయ్యనాయుడు రాక కోసం నెల్లూరీయులు ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. వెంకయ్య ఎన్నికలకు ముందంతా నెలలో ఒకటి రెండుసార్లు నెల్లూరొచ్చి వెళ్లేవారు. మోడీ కేబినెట్‌లో కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఇంతవరకు ఆయన నెల్లూరు రాలేదు. రాష్ట్రంలో తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలకు మాత్రం వెళ్లాడు. నెల్లూరుకు ఆయన రావడం ఇంకొంత ఆలస్యమయ్యే అవకాశముంది. తొలుత 1999లో వాజ్‌పేయి కేబినెట్‌లో ఆయన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పదవిని చేపట్టి నెల్లూరొచ్చినప్పుడు ఇక్కడ భారీగా అభినందనసభలు, సత్కారాలు ఏర్పాటు చేసారు. ఈసారి కూడా అదే లెవల్లో చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నా వెంకయ్య మాత్రం వాటికి దూరంగా ఉంటూ కేవలం అభివృద్ధి కార్యక్రమాలకే ప్రాధాన్యతనిచ్చే అవకాశముంది.

### ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్
## నూతన కార్యవర్గం

నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఈ నెల 16న రంగనాయకులపేటలోని అసోసియేషన్ హాలులో జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా నెల్లూరునగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. నూతన కార్యవర్గంచే అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కార్పొరేటర్ ఎం.ద్వారకానాథ్ ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కార్యవర్గంలో దరిశి సురేష్ బాబు అధ్యక్షుడు, పాబోలు నాగేశ్వరరావు కార్యదర్శి, ఎం.శ్రీనివాసులు కోశాధికారి, బయ్యా ప్రసాద్, తిరువీధి రాఘవులు ఉపాధ్యక్షులు, యేల్చూరు పాంచజన్యం, జి.మల్లికార్జునరావులు సహాయకార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో బులియన్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ శాశ్వత అధ్యక్షుడు శాంతిలాల్ జైన్, అమరా మోహన్‌రావు, తిరువీధి ప్రకాశరావు, మంచికంటి శ్రీనివాసులు, కోట గురుబ్రహ్మం, నాగూరి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పర్యటన రద్దు



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం కావలికి సమీపంలోని చేవూరులో గల శ్రీరామ దూత ఆశ్రమానికి రావాల్సి వుండింది. ఆశ్రమంలో జరిగే పూజల్లో ఆయన పాల్గొంటారని చెప్పి అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేసారు. చంద్రబాబు నేరుగా హెలికాప్టర్‌లో వస్తారని హెలిప్యాడ్‌ను కూడా సిద్ధం చేసారు. అయితే చంద్రబాబు రామదూత ఆశ్రమం సందర్శనపై విమర్శలొస్తాయనే ఉద్దేశ్యంతో తన పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలుస్తుంది.

## కారిడార్‌పై మంతనాలు

బెంగుళూరు - చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టు కూడా చోటు చేసుకోవడం జరిగింది. కృష్ణపట్నం పోర్టు నుండి చెన్నైలోని పొన్నేరి మీదుగా బెంగుళూరు వరకు పరిశ్రమల కారిడార్ ఏర్పాటుపై చర్చించేందుకు జపాన్ ఇంజనీర్ అట్సూసి ఒట్సుక్ ఈ నెల 17వ తేదీన నెల్లూరొచ్చారు. నెల్లూరు జడ్పీ కార్యాలయంలో జడ్పీ సిఇఓ ఎం.జితేంద్ర, మున్సిపల్ ఇంజనీర్ సంపత్‌కుమార్‌లతో సమావేశమయ్యారు. 2011లో భారత - జపాన్ ప్రధానుల మధ్య చెన్నై-బెంగుళూరు కారిడార్ ఒప్పందం జరిగిందని, దీనిపై వివరాలు తెలుసుకునేందుకే తాను వచ్చానని ఈ సందర్భంగా జపాన్ ఇంజనీర్ పేర్కొన్నారు.

## తగ్గని ఎండలు... బెంబేలెత్తుతున్న విద్యార్థులు

వేసవి సెలవులు ముగిసాయి. విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. ఎండలు ఏ మాత్రం తగ్గకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఎండలకు పిల్లల్ని స్కూళ్లకు పంపాలంటేనే పెద్దోళ్లు భయపడుతున్నారు. మిడిమేళంగా కాస్తున్న ఎండల దెబ్బకు ప్రైవేట్ పాఠశాలల్లో ఒంటిపూట బడులే నిర్వహిస్తున్నారు. 18,19 తేదీలలో అన్ని బడులకు సెలవు ప్రకటించారు. నెల్లూరులో అయితే మధ్యాహ్నం 2గంటల నుండి 4గంటల దాకా కరెంట్‌కోత ఉంటుంది. ఈ సమయంలో పాఠశాలలు నిర్వహిస్తే జనరేటర్‌లు ఆన్‌చేయాల్సి వస్తుంది. డీజిల్ ఖర్చు తడిసి మోపెడవుతుంది. అందుకే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎండలు తగ్గేదాకా ఒంటిపూట బడులే మేలనుకుంటున్నాయి.

## నెల్లూరులో నారాయణ జన్మదిన వేడుకలు



తెలుగుదేశంపార్టీ ఆఫీసులో నారాయణ బర్త్‌డే వేడుకలు

నూతనంగా తొట్ట తొలిసారి నేరుగా రాష్ట్ర మంత్రి పదవినలంకరించిన నారాయణ విద్యాసంస్థల అధినేత, నెల్లూరీయుడైన పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలను ఈ నెల 15న పలుచోట్ల ఘనంగా జరిపారు.

నెల్లూరులోని మినిబైపాస్‌లోని తెలుగు దేశంపార్టీ జిల్లా కార్యాలయంలో తెదేపా జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ 57వ జన్మదిన వేడుకలను దిగ్విజయంగా నిర్వహించారు. భారీ పరిమాణంలో తయారుచేసిన కేక్‌ను కట్‌చేసి ఆనందాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో తెదేపా నగర ఇన్‌చార్జి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపాక అనూరాధ, నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నూనె మల్లికార్జునయాదవ్, వెంకటస్వామినాయుడు, తెలుగు యువత జిల్లా ప్రధానకార్యదర్శి జలదంకి సుధాకర్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలనాయుడు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు అంచెలవాణి, విజయమ్మ, అమ్ములు, పద్మజాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో రోగులకు తెదేపా నేత డివిఎస్ గిరి ఆధ్వర్యంలో పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసారు. నేతలు శీలం మల్లికార్జున, కంటె సాయిబాబా, చాట్ల వెంకటస్వామి, పోదూరు సుబ్బయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు. నారాయణరెడ్డిపేటలోని సత్యసాయి ఇంగ్లీషు మీడియం స్కూలులో, హరనాథపురంలోని ఓ.ఆర్.యం ఎయిడెడ్ స్కూల్లో, మధురా నగర్‌లోని అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో, చిల్డ్రన్స్‌పార్క్‌లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, బాలాజీనగర్‌లోని విశాలక్షి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, చీరలు, నారాయణ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో రోగులకు పండ్లు, ఫలహారాలు పంపిణీ చేసి రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ జన్మదిన సంబరాలను అంబరాన్ని అంటేలా నిర్వహించారు. కార్యక్రమాలలో నారాయణ కళాశాల పూర్వవిద్యార్థి ప్రసాద్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వేమిరెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి, లలితారామ్, గురవారెడ్డి, చినబాబు, పెంచలరెడ్డి, హరినాయుడు, రమణయ్య, సత్యసాయిస్కూలు కరస్పాండెంట్ చామకూరు హరగోపాల్, కాపునాడు జిల్లా అధ్యక్షులు ముత్యాల చంద్రమోహన్‌రావు, గణపతి, ఓఆర్ఎం ఎయిడెడ్ స్కూలు హెచ్‌యం దయాలత, హరి, రూపేష్ ప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి రమణయ్య కార్యనిర్వాహక కార్యదర్శి మురళీ మోహన్‌రావు, కోశాధికారి రమణారెడ్డి, నారాయణ వైద్యశాల యం.డి జి.సుబ్రహ్మణ్యం, మెడికల్ కోఆర్డినేటర్ ఎస్.విజయకుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వీరనాగిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ ఎం.వీరప్రసాద్, ఏజిఎం సిహెచ్.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏనుగు పట్టాభికి నివాళి

ప్రముఖ సంఘసేవకులు స్వర్గీయ ఏనుగు పట్టాభిరామిరెడ్డి జయంతిని పురస్కరించుకుని ఈ నెల 17న రోటరీక్లబ్, నెల్లూరు వారు సుబేదారుపేటలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు టి.శేఖర్, కార్యదర్శి కె.ప్రదీప్‌కుమార్, అసిస్టెంట్ గవర్నర్ ఎస్.రాఘవేంద్రశెట్టి, కె.వి.సుబ్రహ్మణ్యం, యన్.నారాయణ, వై.జగన్నాథం, కె.రామకృష్ణారెడ్డి, కె.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవం


నెల్లూరు వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 22న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి బింబప్రతిష్ఠ, మహాసంప్రోక్షణ మహోత్సవము జరుగుతుంది. దీనికి సంబంధించి 19వ తేదీ సాయంత్రం అంకురార్పణ, విష్వక్సేనుల ఆరాధన, పుణ్యాహవాచనము, మృత్యంగ్రహణం, రక్షాసూత్ర ప్రతిష్ఠ, రక్షాబంధనము, సోమకుంభస్థాపన, అంగహోమం, నివేదన, శాత్తుమొరలు, 20వ తేదీ ఉదయం పుణ్యాహవాచనము, వాస్తుహోమం, ఛాయాదివాసం, జలాధివాసం, మన్యోన్మాన శాంతిహోమం, కుంభస్థాపన, నిత్య హోమము, పూర్ణాహుతి, బలిహరణము, సాయంత్రం చతుస్థానార్చన, నేత్రోన్మీలనము, నిత్యహోమము, పూర్ణాహుతి జరిగాయి. 21, 22వతేదీలలో ప్రతిష్ఠాంగహోమము, శయ్యాధివాసం, ప్రాయశ్చిత్త హోమము, కుంభప్రోక్షణ, మహానివేదన, కర్పూరనీరాజనం, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాలు జరుగుతాయని పాలకమండలి అధ్యక్షులు పి.టి.రంగరాజన్ తెలిపారు. అదే రోజులలో శ్రీ గురు వాయూరప్ప మహావిష్ణు వార్షిక బ్రహ్మోత్సవము కూడా జరుగుతుందని భక్తులందరూ ఈ కార్యక్రమాలలో పాల్గొని జయప్రదం చేయమని కోరారు.

## రాచపాలెం రఘుకు గుర్రం జాషువా సాహితీ పురస్కారం



రాచపాలెం రఘుకు గుర్రం జాషువా సాహితీ పురస్కార ప్రదానం

చీరాల సహజ సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15న చీరాలలోని విద్యా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయిలో తెలుగు భాషయందు సాహిత్య రంగంలో కృషి చేసిన వ్యక్తులకు పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ హేతువాద రచయిత రాచపాలెం రఘుకు నవయుగ కవి చక్రవర్తి బిరుదుతో గుర్రం జాషువా సాహితీ పురస్కారాన్ని అందించారు. గత 10సంవత్సరాల నుండి సాంఘిక దురాచారాలు, ప్రజా సమస్యలపై మానవతా వాదం, హేతువాదం, సామ్యవాద దృక్పథంతో సమాజహితం కోరుతూ రచనలు చేస్తున్నందుకు గాను ఆయనకు ఈ పురస్కారం లభించింది. కార్యక్రమంలో చీరాల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సుభాని, ప్రముఖ కవి యన్.వి.రఘువీరప్రతాప్, సహజసాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు వడలి రాధాకృష్ణ, సినీరచయిత ములుగు కుమారస్వామి, ప్రముఖకవి డాక్టర్ బీరం సుందరరావు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 17వ తేదీన బాలాయపల్లి మండలం మల్లెమాల గిరిజన కాలనీలో గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

# గ్రేటర్ నెల్లూరు!

సింహపురి సమాచారం

సీమాంధ్రలో ఒక ప్రత్యేక గుర్తింపు వున్న నగరం నెల్లూరు. భవిష్యత్‌లో పారిశ్రామిక రాజధానిగా పేరున్న ప్రాంతం. సీమాంధ్రలోని ప్రతి జిల్లాను ఒక్కో రంగంలో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. ఈ నేపథ్యంలో నెల్లూరుజిల్లాకు పారిశ్రామికంగా ప్రాధాన్యం లభిస్తోంది. కాగా కేంద్రమంత్రివర్గంలో కీలకపాత్ర పోషించే కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు ఈ జిల్లా మనిషి కావడం నెల్లూరుకు మరోవరం. నెల్లూరు మహానగరంగా అభివృద్ధి చెందడానికి ఇదే సరైన సమయం.

ఈసారి నెల్లూరును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవకాశాలున్నాయి. నెల్లూరు అభివృద్ధికి కేంద్రమంత్రి వెంకయ్య నాయుడుతో పాటు రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ కూడా సంపూర్ణ సహకారం అందించబోతున్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రుల నుండి వచ్చిన ఆదేశాలతో జిల్లా ఉన్నతాధికారులు గ్రేటర్ నెల్లూరు ఏర్పాటుపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది.

ఇప్పటికే నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చుట్టుపక్కల 18గ్రామ పంచాయితీలను కలిపారు. గ్రేటర్ నెల్లూరు పరిధిని ఇంకా విస్తృతంచేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మిగిలిన గ్రామాలను కూడా నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోకి తెచ్చే అవకాశముంది. అలాగే నెల్లూరు చుట్టూ వున్న బుచ్చిరెడ్డిపాలెం, కోవూరు, ఇందుకూరుపేట, టి.పి.గూడూరు, ముత్తుకూరు, వెంకటాచలం, పొదలకూరు వంటి ప్రాంతాలను కలుపుతూ గ్రేటర్ నెల్లూరు ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ద్వారా దేశంలో 100స్మార్ట్ సిటీలను అభివృద్ధి చేయనున్నారు. సంబంధిత శాఖ మంత్రి వెంకయ్యనాయుడే కాబట్టి నెల్లూరు కూడా ఆ వందలో ఒకటిగా ఉండడంలో అనుమానం లేదు. ఈ మేరకు జిల్లాలో భూముల లభ్యత, ఇంతవరకు సేకరించిన భూముల వివరాలపై కేంద్రమంత్రి ఆరా తీసినట్లు సమాచారం. వెంకయ్యనాయుడు ఒకసారి నెల్లూరొచ్చి పోతేగాని నెల్లూరు అభివృద్ధిపై ఒక స్పష్టత రాదు.

# పడని చినుకు... పట్టని కునుకు

## ఆందోళనలో అన్నదాతలు



ఎండలు ఏ మాత్రం తగ్గడం లేదు. చినుకు జాడే కనిపించడం లేదు. వానలు కురుస్తాయన్న ఆశలు అడుగంటుతున్నాయి. భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. జిల్లాలో రెండో పైరు ప్రశ్నార్థకంగా మారుతోంది. జలాశయాల్లో సైతం నీళ్ల ఆవిరవుతుండడంతో వాటితో పాటే రైతుల ఆశలు కూడా ఆవిరైపోతున్నాయి. అవిగో ఋతుపవనాలు వచ్చేస్తున్నాయ్... వర్షాలు దంచేస్తాయ్ అని వాతావరణశాఖ ఊదరకొడితే రైతులు సంబరపడ్డారు. దానికి తగ్గట్లే ఈమధ్య ఒకరోజు ఆకాశం మబ్బులుపట్టి వర్షం కూడా పడింది. 'ఇన్నాళ్లకు గుర్తొచ్చానా వాన' అంటూ 'వర్షం' సినిమాలో త్రిష నృత్యం చేసినట్లుగా రైతులు ఆనందనృత్యాలు చేసారు. కాని ఆ ఆనందం ఒక్కరోజే! పక్కరోజు నుండి మళ్ళీ ఎండలు. ఇంకో పదిరోజులకు జూన్ నెల కూడా పోతుంది. నైరుతి ఋతుపవనాలు దాటిపోయాయంటే ఇక మనకు ఈశాన్య ఋతుపవనాలే దిక్కు. నవంబర్, డిసెంబర్ నెలల్లోనే ఇక వర్షాలు. అప్పటిదాకా సాగు, తాగునీటికి ఇబ్బందులే!

సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లతో పాటు బావులు, బోర్లను నమ్ముకుని ఇప్పటికే రైతులు నారుమళ్లు మొదలుపెట్టారు. కనీసం నైరుతి ఋతుపవనాల మూలంగా ఒక పదును వానన్నా పడితే బోర్లు, బావుల్లో నీటి మట్టాలు పెరిగి సాగునీటి కొరత తీరుతుంది. ఇప్పుడేస్తున్న పంటలు చేతికందే అవకాశముంటుంది. ఈ నెల, వచ్చే నెలలో ఏ మాత్రం ఒక మోస్తరు వర్షం లేకపోయినా అన్నదాతలకు అవస్థలు తప్పవు.

# నెల్లూరు రైల్వేస్టేషన్‌లో కదిలే మెట్లు



నెల్లూరు రైల్వేస్టేషన్ అధునికీకరణలో భాగంగా 1వనంబరు ప్లాట్‌ఫాంపై ఎస్కలేటర్ (కదిలే మెట్లు) నిర్మాణం జరుగుతోంది. ఇప్పటిదాకా నెల్లూరులో ప్రజలకు ఎస్కలేటర్ ఉపయోగం గురించి అవగాహన తక్కువే ననుకోవాలి. హైదరాబాద్, చెన్నై నగరాలలోని పెద్ద షాపింగ్ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్‌లలో మాత్రమే ఈ ఎస్కలేటర్‌లున్నాయి. నెల్లూరులో ఇటీవల మినీబైపాస్‌లో నిర్మించిన ఎమ్మెస్సార్ కల్యాణమండపంలో చిన్నపాటి ఎస్కలేటర్ సౌకర్యం వుంది. కాని మరెక్కడా లేదు. అయితే పిల్లలు, వృద్ధులకు ఇది ఎంతో సౌకర్యంగా వుంటుంది. మిగిలిన వారికి కూడా లగేజి మోయకుండా ఎస్కలేటర్ ద్వారా ఒక ప్లాట్‌ఫామ్ నుంచి మరొక ప్లాట్‌ఫామ్‌లోకి వెళ్లడం సులభసాధ్యమవుతుంది. ఎస్కలేటర్ ఉపయోగంలోకి వస్తే ప్రయాణీకులు దాని మొదటి మెట్టు వద్ద అడుగుపెట్టే సమయంలో చాలా జాగ్రత్త వహించాలి. అలాగే దిగే సమయంలోనూ అప్రమత్తంగా వుండాలి. అది వినియోగంలోకి వచ్చిన మొదట్లో రైల్వే సిబ్బంది ప్రయాణీకులకు సహాయపడుతూ అవగాహన కల్పిస్తే సరిపోతుంది.

## శ్రీమతి బాలార్కకు

# "నాటా" ఆహ్వానం



సుప్రసిద్ధ కర్నాటక శాస్త్రీయ సంగీత కళాకారిణి శ్రీమతి జమ్మలమడక బాలార్కకు "నాటా" (నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్) ద్వైవార్షిక సమావేశాలకు ఆహ్వానం అందింది. జూలై 4, 5, 6 తేదీలలో అమెరికాలోని జార్జియా రాష్ట్రం అట్లాంటాలో జరగనున్న ఈ సమావేశాలలో ఒకరోజున బాలార్క తన గానమాధుర్యంతో అలరించనున్నారు.

గత యేడాది అమెరికాలోని డల్లాస్ నగరంలో జరిగిన "తానా" ద్వైవార్షిక సభలలో కూడా శ్రీమతి బాలార్క పాల్గొని తన గాత్రాన్ని అమెరికాలో తెలుగువారికి వినిపించారు. ఈ సందర్భంగా "ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్" (IANT) వారు శ్రీమతి బాలార్కని "సంకీర్తనాకోకిల" బిరుదుతో సత్కరించారు.

నెల్లూరుజిల్లాలోనే కాక రాష్ట్రంలోను, దేశంలోనూ వివిధ ప్రాంతాల్లో తన సంగీతం ద్వారా శాస్త్రీయ సంగీతానికి ప్రాచుర్యాన్ని కల్పిస్తూ అంచెలంచెలుగా ప్రగతి ప్రస్థానం చేస్తున్న శ్రీమతి బాలార్క తన ఆధ్వర్యంలో నిత్యం వందలాదిమంది శిష్యులకు తర్ఫీదు ఇస్తూ వారిని క్రమశిక్షణతో కూడిన సంగీతకళాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. నెల్లూరులోనూ రాష్ట్రంలోని పలు ఇతర ప్రాంతాలలోనూ టిటిడి వారి ఆధ్వర్యంలో జరిగిన అనేక శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కళ్యాణోత్సవాలలో అన్నమాచార్య కీర్తనలను ఆలపించిన బాలార్క పలువురి ప్రశంసలను అందుకున్నారు.

ఈ యేడాది అట్లాంటాలో జరిగే "నాటా" సభలతో పాటు అమెరికాలో పలు రాష్ట్రాలలో పర్యటించి తన సంగీత సౌరభాలను అమెరికాలోని తెలుగువారికి అందించనున్నారు.

జూన్ చివరి వారం నుండి నెలరోజుల పాటు ఆమె అమెరికా దేశంలో పర్యటించనున్నారు.

# సుడిగుండంలో రామలింగం



తనపై ఎన్ని ఆరోపణలు వచ్చినా పలుకుబడితో చెలాయించుకుంటూ వచ్చిన మాజీవిద్యాశాఖాధికారి మువ్వా రామలింగంపై ఉచ్చు బిగుస్తుంది. ఆయన అవినీతి అక్రమాలపై విచారణ వేగవంతంగా జరుగుతుంది. ఇటీవల నెల్లూరొచ్చిన ఉన్నతాధికారులు జిల్లా విద్యాశాఖాధి కార్యాలయంలో రికార్డులను పరిశీలించి కొన్ని ఫైళ్లను తమ వెంట తీసుకెళ్లారు. దీంతో రామలింగంపై విచారణ తీవ్రస్థాయిలోనే జరుగుతున్నట్లు అర్థమవుతుంది. మువ్వాపై జరుగుతున్న విచారణతో ఆయన కోటరీగా వ్యవహరిస్తూ అక్రమాలకు సహకరించిన కొందరు సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి.

జిల్లా విద్యాశాఖాధికారిగా జిల్లాలో మువ్వా రామలింగం అవినీతి లీలలు కోకొల్లలుగా వున్నాయి. గతంలో డిప్యూటీ డిఇఓగా వున్నప్పుడే రామలింగం తన ప్రతాపం చూపించాడు. అప్పుడు కూడా ఈయనపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇక డిఇఓగా వచ్చాక ఆయనపై ఆరోపణలు లేని రోజంటూ లేదు. ప్రతిరోజూ ఏదో ఒక వివాదమే. చాలామంది ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. కొంతమంది ఉపాధ్యాయులు పరీక్షలు వ్రాయకుండానే పీజీ సర్టిఫికేట్లు పొంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. ప్రభుత్వ ఆర్డర్ల పేరుతో పెద్దఎత్తున ఉపాధ్యాయుల అక్రమ బదిలీలకు అనుమతినిచ్చి తద్వారా అవినీతి సొమ్ము మింగారు. అర్హత లేనివాళ్లను డిప్యూటీ ఐఓలుగా నియమించడం, తనకు పడకపోయిన ఉపాధ్యాయులను వేధించడం, తనకు భజన చేసే ఉపాధ్యాయులు డ్యూటీలకు ఎగ్గొట్టినా పట్టించుకోకపోవడం వంటి ఆరోపణలెన్నో రామలింగం మీదున్నాయి.

అవినీతి రామలింగంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఎప్పటి నుండో ఆందోళనలు చేస్తూనే వున్నాయి. ఇటీవలే రామలింగం పాపం పండి సస్పెన్షన్ వేటు పడింది. విచారణ పూర్తై అక్రమాలు బయటపడాల్సివుంది.




ఇటీవల హైదరాబాద్‌లోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగిన శ్రీ త్యాగరాయ గానసభ 49వ వ్యవస్థాపక దినోత్సవంలో బీజేపీ శాసనసభ్యులు డా॥ కె.లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥ కె.వి.రమణాచారిల చేతుల మీదుగా సాహిత్య పురస్కారాన్ని స్వీకరిస్తున్న జి.వి.ఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ చైర్మెన్ గుదిబండి వెంకటరెడ్డి

# రెండు కమిటీలతో ఆప్కాబ్ పాలన

రాష్ట్ర విభజన నేపథ్యంలో అక్టోబర్ 2 నుండి ఆప్కాబ్ కూడా రెండు రాష్ట్రాల్లో రెండు కమిటీలతో పని చేస్తుందని ఆప్కాబ్ ఛైర్మెన్ ఎన్.వీరారెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీన ఆయన నెల్లూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆప్కాబ్ విభజన ప్రక్రియ సాఫీగా జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఋణమాఫీపై ప్రభుత్వం నుండి ఇంకా స్పష్టత రానందువల్ల రైతులు అయోమయంలో ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 5625కోట్లు, తెలంగాణలో 2720కోట్లు, రెండుచోట్లా కలిపి మొత్తం 8343కోట్లు ఆప్కాబ్‌లో వ్యవసాయ ఋణాలున్నాయని, ఇందులో నాబార్డ్‌కు 4600కోట్లు చెల్లించాల్సి వస్తుందని, ఈ మొత్తాన్ని చెల్లిస్తే రెండు రాష్ట్రాల్లో కలిపి 25 నుండి 30లక్షల మంది వరకు రైతులకు ఋణాలను అందించే అవకాశముంటుందన్నారు. ఆప్కాబ్ ఆస్తుల విభజన బుక్‌వాల్యూతో కాకుండా రిజిస్ట్రేషన్ వాల్యూతో జరుగుతుందని, బుక్‌వాల్యూననుసరించి ఆప్కాబ్ ఆస్తులు కేవలం 3కోట్లే ఉండగా రిజిస్ట్రేషన్ వాల్యూ ప్రకారం 60కోట్లుగా ఉన్నాయని, కాబట్టి ఆస్తుల పంపకంలో రిజిస్ట్రేషన్ వాల్యూనే ప్రామాణికంగా తీసుకోవడం జరిగిందన్నారు. విభజన అనంతరం ఉద్యోగులు ఆస్తులు, అప్పులు, పదోన్నతులు, పదవీ విరమణ వ్యవధి వంటి అంశాలు ప్రభుత్వాల చేతుల్లోనే ఉంటాయని చెప్పారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# క్యారెక్టర్స్ వదలని లీడర్స్

శ్రీను గల్పిక

అది న్యూఢిల్లీలోని టెన్‌జనపథ్. ఉదయం 8గంటలు. అప్పుడే మన్మోహన్‌సింగ్ వచ్చాడు. వెయిటింగ్‌హాల్‌లో కూర్చున్నాడు. ఈలోపు వి. హెచ్.హనుమంతురావు వచ్చి ఆయనకు కాఫీ అందించాడు. ఓ పది నిముషాలకు సోనియాగాంధీ వచ్చింది. ఆమెను చూడగానే మన్మోహన్‌సింగ్ గౌరవ సూచకంగా లేచి... మేడమ్, ఈరోజు అసైన్‌మెంట్ చెప్పండి... అన్నీ పూర్తి చేస్తాను అన్నాడు. సోనియా వుండి... ఆంధ్రరాష్ట్ర విభజన జరిగిపోయింది కదా, తెలంగాణకు 15ఏళ్లు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించండి, అలాగే తెలంగాణకు లక్షకోట్లు ప్యాకేజీ ఇవ్వండి... ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులన్నీ తెలంగాణకే ఇవ్వండి అని చెబుతుండగా... మరి ఆంధ్రావాళ్లకు మేడమ్ అని మన్మోహన్ అడిగాడు. దానికి సోనియా... ఓ లారీ నిండా చిప్పలు పంపించండి అని కోపంగా అంది. మన్మోహన్‌సింగ్ అసైన్‌మెంట్ వ్రాసుకుని పోబోతుండగా... అక్కడే వున్న ఆరోజు పత్రిక కనిపించింది. దాని ఫ్రంట్ పేజీలోనే 'నేడు భూటాన్‌లో ప్రధాని మోడీ పర్యటన' అనే హెడ్డింగ్ వుంది. అది చూడగానే మన్మోహన్‌సింగ్ నాలిక్కరచుకుని... అయ్యో మేడమ్, నేను పొరపాటున వచ్చాను. మొన్న ఎన్నికల్లో మనం ఓడిపోయాం కదా, ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ, అలవాటులో పొరపాటుగా రోజూ వచ్చినట్లే వచ్చానన్నాడు. అప్పుడు సోనియా అవును మన్మోహన్‌జీ, ఆ విషయం నేను కూడా మరచిపోయాను, రోజూ మీకు పనులు చెప్పినట్టే ఈరోజు కూడా చెప్పేసాను... సారీ సారీ అని చెప్పింది.

★★★★★

నరేంద్ర మోడీ ల్యాప్‌టాప్ ఓపెన్ చేసాడు. తన ట్విట్టర్ అకౌంట్‌లో ఆంధ్రప్రదేశ్ విభజన దారుణం. తల్లి నుండి బిడ్డను తీసే ఆపరేషన్‌లో తల్లి లాంటి ఆంధ్రప్రదేశ్‌ను చంపేసారు. కేంద్రంలో మేం అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేస్తాం.. ఇట్లు, నరేంద్ర మోడీ, గుజరాత్ ముఖ్యమంత్రి. అని పోస్ట్ చేశాడు.

★★★★★

ఢిల్లీలోని బీజేపీ కార్యాలయం. యం.వెంకయ్య నాయుడు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. కేంద్రంలో దుర్మార్గ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైంది. ఈ మన్మోహన్ పాలనలో ఉప్పు, నిప్పు ధరలు పెరిగాయి. పప్పులు తరిగాయి, అప్పులు పెరిగాయి. స్వీట్స్, ఫ్రూట్స్, నట్స్, డైమండ్స్ అన్ని రేట్లు పెరిగాయి. ప్రగతి పాతాళానికి, ద్రవ్యోల్బణం ఆకాశానికి... కొరవడిన శాంతి... ఇక కావాలి ఈ ప్రభుత్వానికి విశ్రాంతి... అని చెప్పుకుంటూ పోతుండగా మధ్యలో ఓ విలేకరి కలగజేసుకుని... సార్, యూపిఏ ప్రభుత్వం ఎప్పుడో పోయింది, ఇప్పుడు ఉండేది మీ ప్రభుత్వమేనని గుర్తు చేసాడు. అప్పుడు వెంకయ్యకు గుండె జారినంత పనైంది. రాత్రి పడుకునే ముందు ప్రతిపక్షంలో ఉండగా పార్లమెంట్‌లో రాష్ట్ర విభజన బిల్లు పెట్టిన సందర్భంగా జరిగిన సన్నివేశాలను గుర్తు చేసుకుంటూ పడుకున్నాడు. ఉదయం అదే మూడ్‌లో ఆఫీసుకు వచ్చి అంతే ఆవేశంతో ప్రెస్‌మీట్ పెట్టాడు. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో వున్నది తామేనన్నది తెలియడంతో ఆయన అప్పటికప్పుడు మాటమార్చి గత ప్రభుత్వంలో జరిగిన తప్పులన్నింటిని సరిదిద్ది దేశ అభివృద్ధిని సరైన దారిలో పెడతామని చెప్పి ముగించాడు.

★★★★★

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్. చంద్రబాబు నాయుడు విలేకరుల సమావేశం పెట్టాడు. సీమాంధ్ర, తెలంగాణ నాకు రెండుకళ్లు. ఈ రెండు కళ్లలో ఏదీ తక్కువ కాదు. ఈ రెండు ప్రాంతాల అభివృద్ధే నాకు ప్రాధాన్యం. రెండు ప్రాంతాలకు సమన్యాయం చేయాలని నేను కోరాను. కాని ఒక ప్రాంతానికి అధిక న్యాయం, ఇంకో ప్రాంతానికి అన్యాయం చేసారు. తెలుగుదేశాన్ని రెండు ప్రాంతాల్లో అధికారంలోకి తెస్తాం, రెండు ప్రాంతాలను రెండు కళ్లలాగా చూసుకుంటామన్నాడు. అప్పుడు అక్కడే ఉన్న రేవంత్‌రెడ్డి... తమ బాస్ ఇంకా పాతమూడ్‌లోనే ఉన్నాడని నిర్ధారించుకుని... సార్, ఆల్‌రెడీ ఎన్నికలు ముగిసాయి, ఒక కన్ను ఆపరేషన్ సక్సెస్... ఇంకో కన్ను ఫెయిల్. మీరిప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి. అవతల ఆంధ్రా రైతులు ఋణ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. ముందా సంగతి చూడండన్నాడు. ఋణమాఫీ మాట వినగానే చంద్రబాబుకు గుండెల్లో బండ పడినట్లయ్యింది.

★★★★★

అది తెలంగాణభవన్, టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరుగుతుంది. కేసీఆర్ మాట్లాడుతున్నాడు. ఆంధ్రావాళ్లు ఇక్కడ ఒక్కడూ ఉండకూడదు. వాళ్ల స్టేట్‌కు వాళ్లు వెళ్లిపోవాల్సిందే, లేకుంటే మేమే తన్ని తరిమేస్తాం, ఆంధ్రోళ్లు మనల్ని తెగ దోచుకుతిన్నారు. తిన్నదంతా కక్కిస్తాం, పోలవరం ప్రాజెక్ట్‌ను అడ్డుకుంటాం, దీనిపై సోనియాగాంధీని బజారు కీడుస్తాం. లమ్డీకొడుకులు హైద్రాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేయాలంటారా... హైదరాబాద్ ఎవడబ్బసొత్తని... ఒక్కొక్కడికి మక్కెలిరుగుతాయ్... రేపు మా పార్టీ అధికారంలోకి వస్తది... దళితుడినే తెలంగాణకు తొలిముఖ్యమంత్రిని చేస్తాను అని చెబుతుండగా, అక్కడే వున్న హరీష్ టక్కున మైక్‌కు అడ్డంగా తన చేతిని పెట్టి, ఇంకో చేత్తో కేసీఆర్ నోటిని మూసిపెట్టి... మామా, ఇప్పుడు తెలంగాణకు మీరే ముఖ్యమంత్రి, ఇంకా పాత మూడ్‌లోనే ఉంటే ఎలా అని అన్నాడు. అప్పుడు కేసీఆర్ బుర్రగోక్కుంటూ... అబ్బా... ఆ సంగతే మర్చిపోతినీ... ఎన్నో ఏళ్లుగా అలవాటైందిగా... ఒక్కసారిగా మారలేమంటూ తన ప్రసంగం ముగించాడు.

★★★★★

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం... గేటు ముందు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌ల నాయకత్వంలో ధర్నా జరుగుతుంది. వైసిపి కార్యకర్తలనుద్దేశించి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... నెల్లూరు నగరాన్ని మున్సిపల్ కార్పొరేషన్ ముదురు దోమలకు రాసిచ్చేసినట్లున్నారు, ప్రజలు బయటకొస్తే ఎండలు చంపుతున్నాయి... ఇంట్లో ఉంటే దోమలు చంపుతున్నాయి, ఇక జనాలు బ్రతికేదెట్లా... అసలు నగర, రూరల్ ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారు? కాంట్రాక్ట్‌లు చేసుకుంటూ కోట్లు దండుకుంటే సరిపోతుందా... ప్రజల బాధలు పట్టవా అని ఆవేశంగా అడుగుతుండగా, పక్కనేవున్న తాటి వెంకటేశ్వర్లు... అన్నా, ఎమ్మెల్యేలు ఇప్పుడు వివేకా, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు కాదు, మీరిద్దరే అని చెప్పాడు. అప్పుడు కోటంరెడ్డి నాలిక్కరచుకుని... ఏందో వెంకటేశ్వర్లు... ఈ ఎమ్మెల్యేలకంటే కూడా ఆ ఎమ్మెల్యేలను తిడుతూ వున్నప్పుడే బాగుండిందన్నాడు.

★★★★★

అది స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానంద రెడ్డి(64) గది... ఉదయం 8గంటలు. ఆయన పి.ఏ రాజు లోపలకు వచ్చి... సార్, 8గంటలకు లేపమన్నారు కదా, లేవండి అని అన్నాడు. వివేకా కళ్లు తెరిచాడు. ఇంత చీకటిగా వుంటే, అప్పుడే 8గంటలయిందంటావా, ఏం వేళాకోళంగా వుందా అని గదిమాడు. రాజుకు జరిగిన పొరపాటు అర్థమైంది. వెంటనే వివేకా వద్దకెళ్లి రాత్రి కళ్లకు అలాగే పెట్టుకుని పడుకున్న నల్లద్దాలను తీసాడు. వివేకాకు అప్పుడు అర్థమైంది. అప్పటిదాకా చీకటిగా ఎందుకుందని. వివేకా వెంటనే బాత్‌రూంకెళ్లి కార్యక్రమాలు ముగించుకుని వచ్చాడు. తెల్ల ప్యాంట్, తెల్ల షర్ట్ వేసుకుని మూడురకాల అత్తర్లు కొట్టాడు. ఆయన అంతగా రెడీ అవుతుంటే రాజు మనసులో ఎక్కడో పెళ్లికి పోతున్నట్లున్నాడనుకున్నాడు. వివేకా రెడీ అయ్యి... రాజూ, ఈరోజు ఎక్కడెక్కడ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మన వాళ్లందర్నీ అక్కడకు రమ్మన్నావా అని అడిగాడు. దానికి రాజు బిత్తరపోయి... ప్రోగ్రామ్ లేమిటి, మన వాళ్లను రమ్మనడమేమిటి, మీరింకా ఎమ్మెల్యేనే అనుకుంటున్నారా? అని అడిగాడు. అప్పుడు వివేకా ఈ లోకంలోకి వచ్చాడు. ఏదోరా... 20ఏళ్లుగా అలవాటైన ప్రాణం కదా... ఒక్కసారిగా అలవాటును మార్చుకోలేం.. ఈ ఎండకు బయటకు పోయి మాత్రం ఇరగదీసే పనులేమున్నాయంటూ మళ్లీ కళ్లకు నల్లద్దాలు పెట్టేసి మంచం ఎక్కి పడుకున్నాడు.

## కదంబం

### గోలీసోడా

చిరంజీవి,
కర్నూలు, 98482 12329.

రోడ్డుపైన నడుస్తుంటానా
దాహం వేస్తే చాలు
చిన్నప్పుడెప్పుడో
నాన్నతో కలిసి తాగిన గోలీసోడా
గొంతుకలో కొట్టుకులాడుతుంది
చెట్లు సిమెంటు చప్టాలైన నగరంలో
మాజాలు, పెప్సీ కోలాలే తప్ప
గ్యాసు నింపిన గోలీసోడా దొరకటం
మరీచికలో నీళ్లు వెతకటంలాంటిదే
ఓ వైపు మనిషి రుచి మరిగిన పులిలా
కోటికోటి కిరణాల స్ట్రాలతో
భూమ్మీద నీరు జుర్రేస్తున్న సూరీడు
అదనంగా గాలిని ఆక్రమించిన
'ఎఫ్లుయెంజ్లు'
విషపూరితమైన సూదులతో
మనుషులపైన ఎడతెగని దాడి చేస్తుంటే
వొళ్లంతా బొబ్బలెక్కి
దురదపెడ్తుంటాయి
ఆ రెక్క నగర సుందరీకరణ కోసం
నిట్టనిలువున నరికేసిన చెట్ల ఆత్మలు
వేడెక్కిన వాతావరణాన్ని చల్లార్చలేక
సెగలు సెగలైన మందోష్ణం
మనుషుల్ని వుతికి ఆరేస్తుంటుంది
చల్లగాలి కోసం మనసు ఆరాటమంతా
నెమలి కన్నుల్లోని చూపులా
గుడ్డెద్దు చేలో పడిన చందాన
కథ కంచికి మనమింటికి
కల్ల పసిడికి కాంతిమెండైనట్టు
ఎండ వేడికి చురుకెక్కువ
నాలుక పిడచకట్టి గొంతు తడారి
రక్తం యిగిరి పోతుంటుంది
బోడితలకు బొండు మల్లెలు అబ్బినట్టు
ప్రపంచీకరణ పుణ్యమా అంటూ
పుత్తడి దేహాలపైన ఇత్తడి అందాలు
గోలీసోడా మీద పిడుగుపడింది
'ప్యాసా'ను పైసా కొనేస్తుంది
పీర్ల గుండంలో నడుస్తున్న పాదాలు
కొరివి మోస్తూ కదులుతున్న తలలు
ఉగ్గబట్టిన ప్రాణంలో రగులుతున్న తపన
రుచి మరవని పురాతన ప్రాణానికి
పానకం తాగినా, పుల్లనీళ్లు మింగినా
గోలీసోడా లేనిదే దాహం తీరదు!

## మనోరంజకంగా "సృజన" పాటల పోటీలు

నెల్లూరు వర్ధమాన సమాజం గ్రంథాలయం మిద్దెపైన ఈనెల 15న సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో పాటల పోటీలు సీనియర్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. సీనియర్ విభాగంలో అరుణ, ఉషారాణి, సురేష్‌కుమార్, జూనియర్స్ విభాగంలో లక్ష్మీవైష్ణవి, శ్వేత, సాయిసుస్మిత, సబ్ జూనియర్స్ విభాగంలో మనస్విని, మోక్షిత, నక్షత్రలు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సామ్రాట్ క్లినిక్ అధినేత డాక్టర్ మారం సుధాకర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. సృజన అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ, సభాసింహం బి.వి.నరసింహం, అధ్యాపకులు కొండూరు అపర్ణ, గ్రంథాలయాధికారి రేవతి, బుల్లితెర నటుడు మురళీమోహన్, లోక్‌సత్తా నేత రామారావుచౌదరి, కందికట్టు వేమయ్య, తంగిరాల సుధాకర్, బాబూరావు, కల్యాణి, ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా సెవెన్ లెటర్స్ ఆర్కెస్ట్రా సుధాకర్, సంగీత విద్వాంసులు ముప్పిరాల ఇందిరలు వ్యవహరించారు.

### 45.26 లక్షలతో...

## కళాక్షేత్రంకు సొకులు

నెల్లూరు దర్గామిట్టలోని కస్తూర్బా కళాక్షేత్రం అభివృద్ధికి 45.26లక్షల రూపాయలు ఖర్చు చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ రేఖారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల్లో ఓటింగ్‌పై చైతన్యం కల్పించడానికి నిర్వహించిన థమన్ మ్యూజికల్ నైట్ ద్వారా 83.25లక్షలు సేకరించామన్నారు. ఈ కార్యక్రమానికి 39,98,773 రూపాయలను బ్యాంకు అకౌంట్లలో జమ చేసామని, ఈ నిధులతో కళాక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని ఆమె తెలిపారు.

## విశేషరీతిలో వెంగమాంబ బ్రహ్మోత్సవాలు



దుత్తలూరు మండలం నర్రవాడలో ఏటా వైభవంగా జరిగే వెంగమాంబ బ్రహ్మోత్సవాలు ఈనెల 15న ప్రారంభం కావడంతో ఆర్టీసీ ప్రత్యేకబస్సులు ఏర్పాటు చేసింది. ఆలయ ప్రధానార్చకులు బెల్లంకొండ పెదభద్రయ్య నేతృత్వంలో వెంగమాంబ, గురవయ్య దంపతుల విగ్రహాలకు విశేషంగా పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించగా మహిళా భక్తులు విరివిగా పాల్గొని పొంగళ్ళు పెట్టి అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరొందిన వెంగమాంబను దర్శించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచేకాక వివిధ రాష్ట్రాల నుంచి కూడా ఏటా భక్తులు తరలివస్తున్నారు.

అందుకే ఆర్టీసీ బస్సులను నెల్లూరు నుంచి నర్రవాడకు 32, కావలి నుంచి 10, ఆత్మకూరు నుంచి 13, బద్వేల్ నుంచి 40, పామూరు నుంచి 20, ఉదయగిరి నుంచి 5, పోరుమామిళ్ళ నుంచి 10, ఆర్మూరు నుంచి 4, కోరుట్ల నుంచి 2 ఏర్పాటుచేసారు. భక్తులు వీటిని వినియోగించుకొని అమ్మవారిని దర్శించి ఆమె కృపకు పాత్రులు అవుతారని డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పి.చంద్రశేఖర్ అన్నారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 20.06.2014 నుండి
తేది. 26.06.2014 వరకు

ఈ వారం మీనమేషవృషభమిథున రాశులలో చంద్రుడు, మేషంలో కేతువు, వృషభంలో శుక్రుడు, మిథునంలో రవిబుధులు, కర్కాటకంలో గురువు, కన్యలో కుజుడు, తులలో శనిరాహువులు సంచరిస్తారు.

పంచాంగము: తేది 22 ఆదివారము ఆర్ద్రకార్తె ప్రారంభము.

ముహూర్తము:
తేది 21 శనివారము ఉ॥గం॥7.33 నుండి గం॥9.00లోగా కర్కాటక లగ్నమున వివాహ కేశఖండన. తేది 22 ఆదివారము ఉ॥గం॥9.46 నుండి గం॥11.54 లోగా సింహలగ్నమున వ్యాపార వివాహ ఉపనయన అక్షరాభ్యాస అన్నప్రాశనలు.

జ్యేష్ఠ మాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 20 | శుక్ర | అష్టమి | సా॥గం॥3.44వ॥ |
| తేది. 21 | శని | నవమి | మ॥గం॥1.52వ॥ |
| తేది. 22 | ఆది | దశమి | మ॥గం॥12.31వ॥ |
| తేది. 23 | సోమ | ఏకాదశి | ప॥గం॥11.32వ॥ |
| తేది. 24 | మంగళ | ద్వాదశి | ఉ॥గం॥10.46వ॥ |
| తేది. 25 | బుధ | త్రయోదశి | ఉ॥గం॥10.54వ॥ |
| తేది. 26 | గురు | చతుర్దశి | ప॥గం॥11.31వ॥ |

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక సమస్యలు పరిష్కారానికి రాగలవు. కుటుంబ ఆర్థిక వ్యవహారాలలో సముచిత నిర్ణయాలు తీసుకొంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. ముఖ్య కార్యాలకు ఋణం కూడా చేసే అవకాశం ఉన్నది. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. ప్రముఖులతో పరిచయాలు వ్యాపకాలు పెరుగుతాయి. శుభకార్యాలలో పాల్గొంటారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ప్రభుత్వ ఆఫీసులలో పనులు, ప్రభుత్వ అనుమతులందు కాలయాపన జరుగుతుంది. వృత్తిపరంగా వ్యాపకం, ఆదాయం సంతృప్తికరం. వ్యాపారవర్గాలకు ఆర్థికవృద్ధి, రాబడి పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలు దొరుకగలవు. బిడ్డల ఉద్యోగ వివాహ విషయంలో శుభపరిణామాలు జరుగగలవు. ఉద్యోగులకు అధికారులకు స్థానమార్పులు అదనపు బాధ్యతలుంటాయి.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక ఇబ్బందులను వృత్తి వ్యాపారాలలో అధిగమిస్తారు. రాబడిలో స్వల్ప పెరుగుదల ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. కుటుంబ ఖర్చులు వైద్య ఖర్చులు పెరుగుతాయి. మీ సామర్థ్యంతో ఇతరులను ప్రభావితం చేస్తారు. అనుకున్న పనులు నిదానంగా జరుగుతుంటాయి. గృహమార్పులుంటాయి. వస్తు ఇంటి వాహన రిపేర్లకు ఖర్చుకాగలదు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపారాల నిర్వహణలో ఇబ్బందులుండినా అధిగమిస్తారు. అనుకున్న పనులను పట్టుదలతో శ్రమపడి సాధించుకొంటారు. నూతన పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు అనుకూల సమయము. ఉత్సాహంతో క్రొత్త ఆర్థిక ప్రయత్నాలు, విభేదాలున్న వారితో సర్దుకొనిపోవడం జరుగుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం, ప్రభుత్వం అనుమతులందు ఆలస్యముంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

పనులు ఆలస్యమైనా అనుకొన్న రీతిలో నెరవేర్చుకొంటారు. వృత్తి వ్యాపార రంగాలలో అభివృద్ధితో పాటు ఆదాయం బాగుంటుంది. పిల్లల వల్ల చిన్న చిన్న సమస్యలు ఏర్పడవచ్చును. పెట్టుబడుల మీద ఆదాయం లభించగలదు. అగ్రిమెంట్ల విషయంలో జాగ్రత్తపడండి. వ్యవసాయ రంగాల వారికి, మార్కెట్ రంగాల వారికి ఆదాయం సంతృప్తికరము. ఆరోగ్యం సంతృప్తికరం.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వ్యాపారవర్గాలకు ఆదాయం బాగానే ఉంటుంది. ఆర్థిక ఒప్పందాలలో జాగ్రత్త అవసరం. తొందరపాటు ప్రవర్తన నిర్ణయాలు పనికిరావు. పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. స్థిరాస్తులు షేర్లు పెట్టుబడులపై ఆదాయం లభిస్తుంది. నిర్మాణాలు, రిపేర్ల పనులు జరుగుతాయి. అవసరాలకు విలాసాలకు ఖర్చు లెక్కువగా ఉంటాయి. శుభకార్యాలలో పాల్గొంటారు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ముఖ్య పనులను ఎలా నిర్వహించాలో అర్థంకాక టెన్షన్ పడుతుంటారు. ఇంట, బయట ఖర్చులు అదనంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో స్థిరత చోటు చేసుకొని ఆదాయం తగ్గుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకొనండి. కుటుంబసభ్యులు అనుకూలత తక్కువగా ఉంటుంది. ఉద్యోగులకు పనిభారం స్థానచలనం ఉంటుంది. శుభకార్యాలలో పాల్గొంటారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకున్న పనులు సరిగా జరుగక, వత్తిడుల వలన ఆందోళన ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు తగ్గి ఆర్థిక వ్యవహారాలను జాగ్రత్తగా నడపవలసి వస్తుంది. కొత్త పెట్టుబడులకు అనుకూల సమయంకాదు. కోర్టు వ్యవహారములు కొంత ఆందోళన కలిగిస్తాయి. బంధుముఖ్యులొకరికి అనారోగ్య బాధల సంగతులు వింటారు. ఆరోగ్యం కూడా సరిగా ఉండదు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

గృహ వ్యాపారాల స్థానములు మారడం, వస్తు, వాహన, గృహ రిపేర్లకు ఖర్చులు ఉంటాయి. ఆర్థికస్థితి బాగానే ఉంటుంది. వృత్తి జీవనం స్వల్పంగా పెరుగుతుంది. బాకీలు చెల్లించడం, రావలసిన బాకీలలో కొంత రాబట్టడం జరుగుతుంది. బంధుమిత్రులతో సంబంధాలు బలపడి సన్నిహితంగా మెలుగుతారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి, వ్యాపారాలలో ఆశించిన ప్రగతి ఉండదు. ఆదాయం తగ్గుతుంది. స్థిరాస్తుల లావాదేవీలందు అవకాశాలు లభించగలవు. అనుకున్న పనులకు ఆటంకములుండినా సమర్థవంతంగా జరుపుతారు. ఆలోచనలు పథకాలు కార్యరూపానికి తెచ్చే ప్రయత్నం చేస్తారు. వ్యాపార భాగస్వామ్యాలు లభించడం, పెట్టుబడులపై లాభాలుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

సొంత పనులు అనుకున్న కార్యక్రమాలు సాఫీగా సాగవు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలకు అవకాశాలు అందుతాయి. సభలు సమావేశాలలో మీ సూచన సలహాలకు ఆమోదం లభిస్తుంది. మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండండి. అనుకోని అదనపు ఖర్చులు పైనబడతాయి. శుభకార్యాలు నిర్ణయంకాగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థికపరమైన ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చగలవు. వృత్తి వ్యాపారములందు అభివృద్ధి ఉండి ఆదాయము పెరుగుతుంది. ఉద్యోగులు విధి నిర్వహణ సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. అనుకోకుండా ప్రయాణాలుంటాయి. భాగస్వామ్యాలు కొత్త పెట్టుబడులు అనుకూలిస్తాయి. ఆరోగ్యం బాగుంటుంది.

# నిరుద్యోగులకు చేయూతనివ్వండి

రాష్ట్ర డిప్యూటీ సియంకు సీమాంధ్ర విద్యార్థి జెఏసి విన్నపం



సీమాంధ్ర విద్యార్థి యువజన జేఏసి నేతలు హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్డులోని రాష్ట్ర డిప్యూటీ సియం నివాసంలో ఈనెల 16న ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపి వినతిపత్రం సమర్పించారు. డిప్యూటీ సియం కె.ఇ.కృష్ణమూర్తి హామీతో జెఏసి సంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జెఏసి రాష్ట్ర కన్వీనర్ ముక్కు రాధాకృష్ణగౌడ్ మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటు భాగంగా అన్ని వర్గాల విద్యార్థి యువజన, నిరుద్యోగ యువతకు ఎటువంటి కష్టనష్టాలు లేకుండా ఆయా రంగాలలో అభివృద్ధి పథంలో పయనించే విధంగా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. పేదరికంతో ఏ ఒక్క పేద విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకుండా ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థలు దోపిడిని నిరోధించాలన్నారు. సీమాంధ్రలో జాతీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు విద్యా, శిక్షణ సంస్థలు అందుబాటులోకి తేవాలన్నారు.

అలాగే సీమాంధ్రలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు స్థానిక నిరుద్యోగులకు కల్పించాలని సెజ్‌లలో భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు సంస్థ ఆదాయంలో షేర్లు ఇవ్వాలన్నారు. నిరుద్యోగ యువతకు పరిశ్రమలు స్థాపించుటకు ప్రభుత్వం ఆర్థిక సహాయంతో పాటు, ప్రభుత్వ భూములను ఇప్పించాలన్నారు. అన్ని కులవృత్తుల వారికి ఆధునిక పరిజ్ఞానంతో పాటు అభివృద్ధికి సహకరించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు. పై కార్యక్రమంలో జెఏసి రాష్ట్ర కోకన్వీనర్ ఎం.శివకుమార్, జిల్లా కన్వీనర్ టి.వెంకటేష్‌గౌడ్, నాయకులు జగదీష్, ప్రద్యుమ్నరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ శకుంతలకు మురళీ ఆర్ట్స్ నివాళి


మురళీ ఆర్ట్స్ జోకింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో ఈనెల 14న ఇటీవల మృతిచెందిన ప్రముఖ సినీనటి తెలంగాణ శకుంతల సంతాపసభ నిర్వహించారు. తొలుత తెలంగాణ శకుంతల చిత్రపటానికి పూలమాలవేసి, పుష్పాంజలితో సభ్యులందరూ ఘననివాళి అర్పించారు.

ఈ సందర్భంగా మురళీ ఆర్ట్స్ అధినేత టి.వి. ఆర్టిస్టు శింగంశెట్టి మురళీమోహన్ రావు మాట్లాడుతూ మహారాష్ట్రలో జన్మించి తెలుగునాట నాటకరంగంలో రాణించి 1979లో 'మా భూమి' చిత్రంతో గుర్తింపు పొంది, లేడీవిలన్‌గా, కామెడి ఆర్టిస్టుగా, క్యారక్టర్ ఆర్టిస్టుగా దాదాపు 100సినిమాల దాకా నటించి గయ్యాళి నటి సూర్యకాంతం తరువాత అలాంటి పాత్రలకు ప్రాణం పోసి, అన్ని రకాల పాత్రలను పోషించిన మంచి నటి ఆకస్మాత్తుగా మరణం పొందడం తెలుగు చిత్రసీమకు తీరని లోటని, వారి ఆత్మకు శాంతి కలగాలని సంతాపం ప్రకటించారు. గీతామయి వృద్ధుల ఆశ్రమం అధ్యక్షులు తమ్మినేని పాండు మాట్లాడుతూ "తెలంగాణ" రాష్ట్రం పేరునే తన ఇంటి పేరుగా మార్చుకొని ఆంధ్రుల హృదయాలలో చెరగనిముద్ర వేశారని అన్నారు.

ఈ సంతాపసభలో సహస్ర సభా సింహం బి.వి.నరసింహం, పాముల రమణయ్యలు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. గౌతమ్, పునీక్, చైతన్య, సరళ మరియు సభ్యులు పాల్గొన్నారు.




# సూక్ష్మరూప కేధార్‌నాథ్ ఆలయం రూపొందించిన గంధవళ్ళ



గత సంవత్సరం ఇదే నెలలో హిమాలయ పర్వతశ్రేణుల్లోని పుణ్య క్షేత్రం కేధార్‌నాథ్‌లో శివుని దర్శనం కోసం వెళ్ళిన భక్తులు జలవిలయంలో చిక్కుకుని అశువులు బాసిన విషయం తెలిసిందే. సరిగ్గా ఈనెల 17వతేదీకి ఏడాది కావడంతో ఆ భక్తులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ నెల్లూరులోని సూక్ష్మకళాకారుడు గంధవళ్ళ ఉమాశంకర్ కేధార్‌నాథ్ ఆలయ సూక్ష్మ రూపాన్ని కర్బనం పెన్సిల్స్ ముక్కలతో రూపొందించారు. శివసాన్నిధ్యం పొందిన భక్తులకు నివాళిగా 321 కర్బనం పెన్సిళ్ళు ఉపయోగించి కేధారేశ్వరుడి ఆలయ నమూనాను 7సెం.మీ పొడవు 4సెం.మీ వెడల్పు, 9సెం.మీ ఎత్తుతో తీర్చిదిద్దారు.

# ముస్లిం యూత్ సేవలు ప్రశంసనీయం



నెల్లూరుజిల్లా ముస్లిం సేవా కమిటీ ఆధ్వర్యంలో షాబాన్ నెల సందర్భంగా ఈనెల 16న హిమాచల్‌ప్రదేశ్ దుర్ఘటనలో మృతిచెందిన విద్యార్థుల పేరు మీద దువా చేసి నెల్లూరు జెండావీధి ట్యాంకు వద్ద ఉర్దూ పాఠశాలలోని పిల్లలకు ఓ.ఆర్.ఎస్. జ్యూస్‌లు, మామిడి, దానిమ్మ పండ్లను ముస్లిం యూత్ ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక 43వ డివిజన్ కార్పొరేటర్ ఎం.డి.ఖలీల్ మాట్లాడుతూ హిమాచల్ ప్రదేశ్ ఘటనలో మృతి చెందిన విద్యార్థులకు సంతాపం తెలుపుతూ ముస్లిం యూత్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఇలాంటి సేవలు భవిష్యత్తులో ఎన్నో చేయాలని కోరారు. ముస్లిం యూత్ జిల్లా అధ్యక్షుడు ఎస్.డి.ఖలీద్, కె.జి.ఎన్.ఫ్రూట్స్ మున్నా, క్యాటరింగ్ ఇస్సాక్, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు సమీర్, ఎం.మైను, రియాజ్, ఆబీద్, హెడ్‌మాస్టర్ అబ్దుల్ గయాజ్, సందాని గోల్డ్ స్మిత్ ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ వైభవం...!



వింజమూరు వాస్తవ్యులు గణపం వెంకటరమణారెడ్డి - (లేట్) సునీతల కుమార్తె ప్రశాంతి - మాధవరెడ్డి (కోవూరు వాస్తవ్యులు మానం వెంకటరమణారెడ్డి - (లేట్) విజయలక్ష్మిల కుమారుడు)ల వివాహం ఈ నెల 11న వింజమూరు, శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానం నందు వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

## వేడుకగా శ్రీనివాసుని కల్యాణం

శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకొని మంగళవారం నెల్లూరులోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. టీటీడీ, హిందూధర్మ ప్రచారపరిషత్, ధర్మ ప్రచార మండలి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. తొలుత అర్చకులు ఫణిశర్మ, నాగేంద్ర శర్మలు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం దేవదేవేరులను అందంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య మాంగల్యధారణ చేసారు. ఈ కార్యక్రమంలో గాయకులు మహేష్, బాలకృష్ణ ఆలపించిన అన్నమయ్య కీర్తనలు భక్తులను ఆనందపరవశులను చేసాయి. కముజల వెంకటరెడ్డి, మల్లిక, లోకేష్, సంయుక్తలు ఈ కల్యాణానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధ్యక్షులు సి.వి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి వి.ధనుంజయ, ఉపాధ్యక్షులు కొండా శేఖర్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ ఎం.శ్రీహరి, సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, వీరిశెట్టి సుధాకర్, ఆలూరు శిరోమణిశర్మ, సనత్‌కుమార్‌రెడ్డి, వి.కె.సుధీర్, నలుబోలు బలరామయ్యనాయుడు, కె.గిరిజ, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆనం వారికి దారేది..?

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్‌కి భవిష్యత్ లేదు. ఇప్పుడు ఆనం సోదరుల భవిష్యత్ ఏంటన్నది ప్రశ్న? రాజకీయాల్నే వృత్తిగా, వ్యాపారంగా చేసుకున్న ఆనం బ్రదర్స్ అధికారపక్షంలోనైనా ఉండాలి, ప్రతిపక్షంలోనైనా ఉండాలి. లేకుంటే వాళ్లు తమ వర్గాన్ని, తమ ఉనికిని కాపాడుకోలేరు. ఈ నేపథ్యంలోనే ఆనం సోదరులు తెలుగుదేశం పార్టీలో చేరుతారనే ప్రచారం వచ్చింది. జగన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ వాళ్లు ఎలాగూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరలేరు. ఇక పోతే తెలుగుదేశంపార్టీలోకే. మొన్న మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును కలుసుకున్నప్పటి నుండి ఆనం సోదరులు తెలుగుదేశంలో చేరుతున్నారనే వార్తలకు బలం చేకూరింది. రామనారాయణరెడ్డి కూడా తెలుగుదేశం నుండి పిలుపు వస్తే ఆ పార్టీలో చేరే విషయం ఆలోచిస్తానని చెప్పడం సానుకూల సంకేతాలను పంపినట్లయ్యింది.

వాస్తవంగా ఎన్నికలకు ముందే ఆనం సోదరులను తెలుగుదేశంలోకి రమ్మని కోరాడు చంద్రబాబు. ప్రభుత్వం వస్తే మంత్రివర్గంలోకి కూడా ఖచ్చితంగా తీసుకుంటానని చెప్పాడు. ఆనం సోదరులు ఆరోజే తెలుగుదేశంలో చేరివుంటే జిల్లాలో ఫలితాలు ఇంకొంత భిన్నంగా వుండేవి. నెల్లూరు లోక్‌సభ, ఆత్మకూరు అసెంబ్లీ ఖచ్చితంగా తెలుగుదేశం ఖాతాలో చేరేవి. నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, సర్వేపల్లి నియోజకవర్గాలలో గట్టిపోటీ నడిచి వుండేది. కాని ఆరోజు ఆనం రామనారాయణరెడ్డి కిరణ్ దిగిపోతే సీఎం పదవి రావచ్చన్న ఆశతో చంద్రబాబు పిలుపుకు స్పందించలేకపోయారు.

అయితే ఆనం సోదరులలో రామనారాయణరెడ్డికి తప్పితే ఆనం వివేకాకు పార్టీ మారే ఉద్దేశ్యం లేనట్లు కనిపిస్తుంది. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌ను వదిలిపోవడం ఆయనకు ఇష్టం లేదు. భవిష్యత్‌లో ఆయనకు పోటీ చేసే ఉద్దేశ్యం కూడా లేదుకాబట్టి ఆయనకు ఏ పార్టీలో వున్నా ఒక్కటే! కాంగ్రెస్‌లో కింగ్‌లాగా బ్రతికి, ఇప్పుడు చంద్రబాబు ముందు తల వంచలేడు. కాని రామనారాయణరెడ్డికి రాజకీయ భవిష్యత్ మీద ఆశ ఉండడంతో ఆయన పార్టీ మారే అవకాశాలు ఉండొచ్చని సమాచారం!

## అయోమయంలో అన్నదాత

(మొదటిపేజీ తరువాయి)

అంత డబ్బు ఎక్కడ్నుంచి తెచ్చి కట్టగలదు. నాబార్డ్ ఛైర్మెన్ కోటయ్య అధ్యక్షతన వేసిన కమిటీ ఋణ మాఫీ కోసం కొన్ని విధివిధానాలను తయారు చేస్తుంది. వీలైనంత వరకు ఋణ మాఫీ భారాన్ని తగ్గించుకోవడానికే చంద్రబాబు ఈ కమిటీని వేసారు. ఋణాలు తీసుకున్న వారిని సన్నకారు, చిన్నకారు, పెద్ద రైతులుగా విభజించనున్నారు. అలాగే బంగారం లోన్‌లను ఒక కేటగిరి క్రిందకు తెచ్చి వీటిలో మహిళల పేరుతో వున్న ఋణాలనే రద్దు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఋణమాఫీలో సన్నకారు, చిన్నకారు రైతులకే అవకాశం కల్పించాలని చూస్తున్నారు. ఎన్నికల వాగ్దానంలో చంద్రబాబు ఓ చిన్న పొరపాటు చేసాడు. అర్హులైన వారందరికీ ఋణమాఫీ చేస్తానని చెప్పివుంటే ఈరోజు చాలా రకాలుగా ఋణమాఫీ భారాన్ని తగ్గించి వుండొచ్చు. ఎంపిక చేసిన రైతులకే ఋణమాఫీని వర్తింపచేసి వుండొచ్చు. కాని ఆయన పూర్తి ఋణమాఫీపై వాగ్ధానం చేయడం తలకు చుట్టుకుంది. ఋణమాఫీపై చంద్రబాబు ఇంతవరకు ఏమీ తేల్చకపోవడంతో అసలు ఋణాలు రద్దవుతాయో లేదో, రద్దైతే ఎంతవరకు ఉంటుందో, ఋణమాఫీ రద్దుకు ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు విధిస్తుందో తెలియక రైతులు అయోమయంలో ఉన్నారు.

## మంత్రి నారాయణకు అభినందనలు



జూన్ 18వ తేదీ బుధవారం సచివాలయంలో మున్సిపల్ మరియు పట్టణ ప్రణాళికా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన డా॥ పొంగూరు నారాయణను అభినందిస్తున్న అన్నమాచార్య ఆరాధన సమితి అధ్యక్షుడు కె.వి.సుధాకరరాజు మరియు NAR ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, నారాయణకి తొలి శిష్యుడు నూకలపాటి అనిల్‌రెడ్డి.

## సీమాంధ్రకు శుభం..!

(మొదటిపేజీ తరువాయి)

భవనాలన్నీ పూర్తయ్యాక రాజధానిని ఇక్కడకు మార్చాలనుకుంటే పుణ్యకాలం కాస్తా కరిగిపోతుంది. విలువైన కాలం ముందుకు జరిగిపోతుంది. సీమాంధ్ర అభివృద్ధికి తొలిమెట్టు రాజధాని నగరం. ముందు రాజధానిని ఎంపిక చేయాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయవాడ - గుంటూరుల మధ్యే రాజధాని అని సంకేతాలిచ్చారు. వారానికి రెండురోజులు ఇక్కడే వుండి పరిపాలన సాగిస్తానని చెబుతున్నారు. అదే సమయంలో హైదరాబాద్‌లో వారానికి నాలుగురోజులు ఉండి అక్కడ తెలంగాణపార్టీ వ్యవహారాలు, సీమాంధ్ర పరిపాలన చూస్తానంటున్నాడు. ఇది కరెక్ట్ కాదు. విజయవాడ - గుంటూరులలో అద్దెభవనాలు తీసుకునైనా పూర్తిస్థాయిలో పరిపాలనను ఇక్కడ నుండే కొనసాగించాలి. కృష్ణా, గుంటూరుజిల్లాలో అడ్మిషన్లు లేని ఇంజనీరింగ్ కళాశాలలు మరియు మూతపడే దశలో ఎన్నో ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలు ఉన్నాయి. ఉద్యోగులకు అవసరమైన గృహాలు కూడా అందుబాటులో వున్నాయి. అంతగా అవసరం అనుకుంటే ప్రభుత్వస్థలాలను చూపిస్తే ఏడాదిలో భారీ ఎత్తున అపార్ట్‌మెంట్లను నిర్మించి ఉద్యోగులకు గృహవసతి కల్పించవచ్చు. రాష్ట్ర డిజిపి కోసం మంగళగిరి బెటాలియన్ క్యాంపస్‌ను కేటాయించారు. డిజిపి పూర్తి స్థాయిలో ఇక్కడ నుండే పని చేయవచ్చు. ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తిస్థాయిలో ఇక్కడ క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుంటే ఆ తర్వాత అన్ని ప్రభుత్వ శాఖలు కూడా ఒక దాని వెంట ఒకటి తరలివస్తాయి. ముందు తాత్కాలికంగానైనా ఇక్కడ పనులు ప్రారంభిస్తే సీమాంధ్ర అభివృద్ధి ఈరోజు నుండే మొదలవుతుంది. హైదరాబాద్ కేంద్రంగా వున్న వ్యాపార, విద్య, వైద్య, ఇతరత్రా సంస్థలన్నీ సీమాంధ్ర వైపు క్యూ కడతాయి. పదేళ్ల కాలం వుంది కదా అని ఈ పదేళ్లు హైదరాబాద్‌లోనే సర్దుకుంటే సీమాంధ్ర అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంటుంది.

## నా కల.. ఫలించింది!

(3వ పేజీ తరువాయి)

అందరి హృదయాల్లో తనదంటూ ప్రత్యేకమైన స్థానం పొందాడు. ఇటీవల తన స్నేహితుడొకరు ప్రాణాపాయంతో ఆసుపత్రిలో చేరితే, అతని వైద్యం కోసం సుమారు లక్షలాది రూపాయలు వెచ్చించాడంటే, స్నేహానికి నారాయణ ఎంత ప్రాధాన్యత ఇస్తాడో ఇంతకన్నా చెప్పేదేముంది?..ఒక మంచి ఉపాధ్యాయునిగా, విద్యావేత్తగా, మంచి స్నేహితునిగా, మంచి పౌరునిగా, ఎంతో మందిని ఆదుకుంటున్న దాతగా సమాజానికి తనవంతు ఎన్నో రకాల సేవలు అందిస్తున్న నారాయణ అంటే నాకెంతో ఇష్టం కూడా. నేనన్నా, నా శ్రీమతి అన్నపూర్ణ దుర్గాభవాని అన్నా నారాయణకూ ఎంతో ఇష్టం. నేను నారాయణకు గురువునే అయినప్పటికీ, ఇప్పుడు విద్యారంగంలో లక్షలాదిమంది విద్యార్థులకు నారాయణ గురువు కావడం మరెంతో సంతోషం కలిగించే విషయం. నేను వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ ఎంతో గౌరవంగా, జాతీయస్థాయిలో విఖ్యాతిగన్న నారాయణ విద్యాసంస్థలకు గౌరవ సలహాదారుగా నాకు స్థానం కల్పించడం ఆయన గురుభక్తికి ఒక నిదర్శనం. అయితే, రాజకీయపరంగా నారాయణకు పెద్దగా అనుభవం లేకున్నప్పటికీ సమాజాభ్యున్నతికి ఒక మంచి విజన్ వున్న మంచి విద్యావేత్త కావడం ఆయనకు అన్నివిధాలా అనుకూలించే అంశం. మనసులో చిత్తశుద్ధి, లక్ష్యసాధనపై కృషి, పట్టుదల వుండాలే గానీ మనిషి సాధించలేనిదంటూ ఏమీ వుండదు. అలాంటి దీక్షాదక్షతలన్నీ నారాయణలో పుష్కలంగా వున్నాయి. అవే ఆయన విజయానికి బాటలు వేస్తాయి. ఏ రంగంలోనైనా సరే, ఆయన అంతులేని ఆత్మవిశ్వాసంతో రాణిస్తాడన్న సంపూర్ణ విశ్వాసం నాకుంది. మంత్రిగా కూడా తన బాధ్యతలను నూటికి నూరుపాళ్ళు శ్రద్ధాసక్తులతో నిర్వహించి అందరి మన్ననలూ అందుకుంటాడనంలో ఎలాంటి సందేహం లేదు. రాష్ట్ర పునర్నిర్మాణానికీ, రాష్ట్ర ప్రగతికీ కంకణబద్ధుడై, ప్రజలంతా ఆకాంక్షించే నవ్యాంధ్రప్రదేశ్ పురోగామిపథంలో పయనించేందుకు, ప్రగతిలో మన రాష్ట్రం అగ్రగామిగా వుండేందుకు నారాయణ తనవంతు సేవలను పూర్తిస్థాయిలో అందిస్తాడని నా పరిపూర్ణ విశ్వాసం. ఒక మంచి విద్యావేత్త ప్రజాసేవారంగానికి వచ్చినప్పుడు ప్రగతికి ఇక కొదవేమీ వుండదని అందరి అభిప్రాయం. తన స్వస్థలమైన నెల్లూరు జిల్లా కూడా నారాయణ నేతృత్వంలో, అభివృద్ధి పథంలో మరింతగా పురోగమిస్తుందని ప్రజలందరి విశ్వాసం. ఏదేమైనా..నా కల ఫలించింది. కండక్టర్ కొడుకును కలెక్టర్‌ను చేయాలనుకున్నా..ఒకవేళ కలెక్టర్ కాలేకపోయినా, అంతకన్నా ప్రజాసేవలో తరించే పదవిలో వుండడం ఎంతో సంతోషం కలిగించే విషయం. నారాయణ మంత్రి కావడం నాకే కాదు, జిల్లాకే ఒక గొప్ప వరం అని నేను భావిస్తున్నా.. భగవంతుని ఆశీస్సులు ఆయనకు మెండుగా వుండాలని, మా నారాయణ ప్రజల అభ్యున్నతికి మరింతగా బాటలు వేసి, అటు జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలందరి ప్రశంసలూ అందుకోవాలని మనసారా కోరుకుంటున్నా!..

# గూడూరు డివిజన్ వార్తలు

## వెంకటేశ్వరస్వామికి అశ్వవాహనసేవ



గూడూరులోని రాజావీధిలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. అందులో భాగంగా శనివారం ఉదయం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రి చోరసంవాదం, పారువేట ఉత్సవం జరిగింది. శ్రీవారు అశ్వవాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీ కారణంగా క్యూలో గంటల తరబడి వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. నెల్లూరుకు చెందిన గురుకృపా కళాక్షేత్రం వారిచే చిన్నారులు, విద్యార్థులు ప్రదర్శించిన జానపద, భరతనాట్య ప్రదర్శనలు అందర్ని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా వల్లంకొండ గోపాలకృష్ణ మూర్తి, శ్రీహరినాయుడు, సొల్లేటి సుబ్బరాయులు, కుమారులు వాయుగండ్ల సుబ్బారావు సోదరులు, గోష్టు ప్రభాకర రావు, నీలిశెట్టి విఠల్‌రావు, సొల్లేటి వెంకటసుబ్బయ్య వున్నారు. ఆలయ ఈఓ తాతా శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

## వివేకానంద పాఠశాలలో విగ్రహాల ప్రతిష్ఠ


స్కూల్‌లో ప్రతిష్టించిన పురుషోత్తం, సుజాతమ్మల విగ్రహాలు

గూడూరులోని వివేకానంద పాఠశాలలో ఆ పాఠశాల వ్యవస్థాపకులు కీ౹౹శే౹౹కేశంశెట్టి పురుషోత్తం ఆయన సతీమణి కీ౹౹శే౹౹సుజాతమ్మల విగ్రహాలను 14వ తేదీ పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు, కుటుంబసభ్యులు ప్రతిష్టించారు. పురుషోత్తం గూడూరులో మొట్టమొదటిసారిగా పాఠశాలను ఏర్పాటుచేసి గత 35 సంవత్సరములుగా విద్యావేత్తగా ఉన్నారని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. పురుషోత్తం పేరు మీద పాఠశాలలో ప్రతి సంవత్సరం 10వ తరగతిలో పాఠశాలలో ప్రథమంగా వచ్చిన విద్యార్థికి రూ॥3000/-లు పారితోషికాన్ని ప్రకటించారు. 2014సంవత్సరం 10/10 పాయింట్లు సాధించిన విద్యార్థిని కె.స్వప్నకు రూ॥3000/-లును అందించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.ఆర్.రెడ్డి, చదలవాడ వెంకటశేషయ్య, స్కూల్ కరస్పాండెంట్ కె.చంద్రమోహన్, కె.వంశీకృష్ణ, కౌన్సిలర్లు చెంచు రామయ్య, రమేష్, పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు, స్థానికులు, పట్టణంలోని పలు స్కూలు కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా సాయిబాబా ఊరేగింపు



గూడూరు రెండవ పట్టణం లోని నరసింగరావుపేట ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న గురుసాయి మందిరంలో ఈనెల 22వతేదీ విగ్రహప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు మందిరం కమిటీసభ్యులు "లాయర్"కు తెలిపారు. ఈ సందర్భంగా జైపూరు నుంచి తెప్పించిన విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి ఆదివారం పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. నాయిబ్రాహ్మణుల డోలు వాయిద్యం అందరినీ ఆకట్టుకొంది.

## సునీతా సేవా సంస్థకు అవార్డు


అవార్డును అందుకుంటున్న సారంగం సులక్షి

గూడూరులోని సునీతా సేవా సంస్థకు ఉత్తమ బ్లడ్ మోటివేషన్ అవార్డును సారంగం సులక్షికి జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో అందజేశారు.

## ఎల్ఐసీ ప్రీమియం చెల్లింపు కేంద్రం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బాలయ్య

గూడూరులోని కరుణాలవీధి సమీపానున్న భవనంలో 14వ తేదీ నెల్లూరుకు చెందిన ఎల్ఐసి మార్కెటింగ్ మేనేజర్ బాలయ్య ప్రీమియం కేంద్రాన్ని ప్రారంభించారు. ఎల్ఐసీ దారులు నిర్ణీత సమయం అనేది లేకుండా ఈ కేంద్రం ద్వారా చెల్లింపులు చేయొచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక బ్రాంచి మేనేజర్ రాముచౌహన్, సహాయ మేనేజర్ ఆంజనేయులు, డెవలప్‌మెంట్ అధికారి చంద్రయ్య, కె.మునిగిరీష్, ఏజంట్లు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి


రక్తదానం చేస్తున్న 14వవార్డు యువత

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తెలుగుదేశం పార్టీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిని పొనకా దేవసేన అన్నారు. గూడూరులోని ప్రాంతీయ వైద్యశాలలో శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగుదేశంపార్టీ మున్సిపల్ ఛైర్మెన్ అభ్యర్థిని, 14వవార్డు కౌన్సిలర్ కోడిపర్తి కల్పన సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి 14వవార్డు యువత ముందుకొచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దేవసేన, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, 14వవార్డు కౌన్సిలర్ కోడిపర్తి కల్పనలు మాట్లాడుతూ రక్తదానం అనేది ఓ ప్రాణాన్ని కాపాడడం అని అన్నారు. 33 వార్డుల్లో ఉన్న యువత ముందు కొచ్చి రక్తదానం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి, నిర్వాహకులు శ్రీధర్, ప్రమీలారాణి, 14వవార్డు యువత తదితరులు పాల్గొన్నారు.

## బలిజలను బీసీలుగా గుర్తించాలి

**- చదలవాడ హరిప్రసాద్**

బలిజలను బీసీలుగా గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ సంఘ నాయకులు చదలవాడ హరిప్రసాద్ కోరారు. మఠంవీధిలో ఆయన ఆధ్వర్యాన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చదలవాడ హరిప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ నాయకులంతా సమిష్టిగా పోరాడితే బీసీలుగా గుర్తింపు పొందడం కష్టమేమి కాదన్నారు. సంఘనాయకులు శీలం కిరణ్‌కుమార్, ఎం.వీ.రమణయ్య, రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి న్యూస్

### వాయులింగేశ్వర సన్నిధిలో

## వైకాపా ఎమ్మెల్యే చెవిరెడ్డి



శ్రీకాళహస్తీలోని ముక్కంటి సన్నిధిలో వైకాపా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు, రాహు-కేతు పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం శ్రీవారి దర్శనానంతరం శ్రీకాళహస్తీశ్వరస్వామి సన్నిధికి ఆయన కుటుంబ సమేతంగా విచ్చేశారు. సుపథ మండపం వద్ద ఆలయాధికారులు ఆయనకు పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో ఆయ సమేతంగా పలు సేవల్లో పాల్గొన్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి వద్ద స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు, తీర్థప్రసాదాలను పి.ఆర్.ఓ. హరిబాబు, ఎపిఆర్‌ఓ హరినాథరెడ్డి, వైకాపా నాయకులు గుమ్మడి బాలకృష్ణ, మిద్దెల హరి, నాని, అంజూరు శ్రీనివాసులు మరియు వైకాపా నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ వేదపండితులు ఆశ్వీరాదం చేసి తీర్థ ప్రసాదాలను అందచేశారు.

## ఇ.ఓ. లేక ఇబ్బందులు

శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థాన సన్నిధిలో రాష్ట్రంలో ప్రత్యేక రాహుకేతు క్షేత్రంగా పేరుగాంచిన ఆలయంలో పది రోజులుగా గతంలో పనిచేసిన ఇ.ఓ. ఆలయ దర్శనాలు, రాహు-కేతు పూజలు, వి.ఐ.పి.లకు అన్ని ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు. ఇప్పుడు వచ్చిన ఇ.ఓ. సెలవు పెట్టి వెళ్లిపోవడం వల్ల స్వామి వారికి నైవేద్యం, అభిషేకాలు అర్ధగంట సేపూ ఆలస్యంగా జరుగుతున్నాయని ఇన్‌ఛార్జి ఇ.ఓ.తో ఆలయ పరిపాలన సాగించడం సాధ్యం కాదని ఫుల్ ఇన్‌ఛార్జి ఇ.ఓ.కు త్వరలో బాధ్యతలు ఇచ్చేలా దేవాదాయ ధర్మాదాయ శాఖ త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. రాహు-కేతు పూజల్లో కొన్ని లోపాలున్నాయి, ఆ లోపాలను కూడా సరిదిద్దాల్సిన అవసరం ఉంది. భక్తులు అసంతృప్తికి లోనుకాకుండా ఉండేందుకు అర్ధగంట చేయాల్సిన రాహు -కేతు పూజ 20 నిమిషాలకే బంతి వదలడం వల్ల భక్తులు అసంతృప్తికి లోనవుతున్నారు. సోమవారం, మంగళవారం కొబ్బరి కాయలు , పూలు నిమ్మకాయలు ఇవ్వన్ని కూడా కొత్తగా ఉంటున్నాయి. దానిపై బాధ్యత గల కార్యనిర్వహణాధికారి ఉంటే అలాంటి లోపాలు జరగకుండా ఉంటాయి.

## నత్తనడకన నడుస్తున్న లో లెవెల్ కాజ్‌వే

శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం సన్నిధిలో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేలాది మంది వచ్చి దర్శించుకుంటారు. గత కొంత కాలంగా ట్రాఫిక్ అంతరాయం ఎక్కువ కావడంతో దానిని నిర్మూలనలో భాగంగా స్థానిక పట్టణంలోని సన్నిధివీధి సమీపంలో సన్నిధివీధి జలవినాయకుని నుంచి పొన్నాలమ్మ గుడి వరకు లో లెవెల్ కాజ్‌వే నిర్మాణం కొనసాగుతుంది. అంచనాలు 7 కోట్ల 30 లక్షల రూపాయలు వెచ్చించి ఈ నిర్మాణం చేస్తున్నారు. నాణ్యత లేని కమ్మి, నాణ్యత లేని సిమెంటు, ఇసుక, మెటల్ నిర్మాణం నిర్వహిస్తున్నారు. ఇప్పటికి రెండు సంవత్సరాలు గడిచింది. నిర్మాణం ప్రారంభమై ట్రాఫిక్ తీవ్రం అవుతుంటే ఆలయాధికారులు కానీ, కాంట్రాక్టర్ గాని పనులు వేగవంతం చేసి ట్రాఫిక్‌ను నియంత్రించే బాధ్యతను తీసుకోవడం లేదు. పిల్లర్ల కోసం బావుల్లో తోడిన ఇసుకను వినియోగిస్తున్నారు. అది మట్టి, ఇసుక కలసి ఉందని అలాగే ఒక ఇంచి మెటల్ వేయాల్సి ఉండగా అర ఇంచి మెటల్ వేసి ఉన్నారు.

నాణ్యత లేని సిమెంటు వాడుతున్నారని, ఐ.ఎస్.ఐ. ముద్ర ఉండే కమ్మిని వినియోగించడం లేదని, తక్కువ ధరకు కొనుగోలు చేసి కమ్మిని వినియోగిస్తున్నారని పిల్లర్‌కు గాని, బ్రిడ్జి వంతెనకు గాని వాడే కమ్మి, మెటీరియల్ వాడడం లేదని నాలుగు అంగుళాలకు ఒక కమ్మి వేయాల్సి ఉండగా 8 అంగుళాలకు ఒక కమ్మి వినియోగిస్తూ కాంట్రాక్టర్ ఆలయాధికారులకు చేతులు తడిపి ఇష్టం వచ్చే రీతిలో నిర్మాణం చేపడుతున్నారని విమర్శలున్నాయి. పనిచేసే ఇ.ఓ.లు ఆలయం వరకే పరిమితం తప్ప, లో లెవల్ కాజ్‌వే పనులు పరిశీలించడం లేదని, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎస్.సి.ఇ. వారి అంచనాల మేరకు నిర్మాణం సాగకపోయినా పట్టించుకోవడం లేదనే విమర్శ కూడా వుంది. 7 కోట్ల 30 లక్షల రూపాయలు భక్తుల నిధులను వాటాలు పంచుకుని స్వాహాలు చేశారని, దాని వల్ల పనులు నాణ్యతగా జరగడం లేదని విమర్శలున్నాయి.

భక్తులు వేసే కానుకలను స్వామి వారి సేవలకు, భక్తుల సేవలకు వినియోగించాల్సి ఉండగా ఆలయానికి వచ్చే భక్తులకు తగిన రూములు, విశ్రాంతి గదులు, త్రాగునీరు, అభిషేకాలు చేసుకునే వారికి పలు సేవలపై దృష్టి సారించాల్సింది పోయి వాటాలు వచ్చే దానిపై దృష్టి సారించారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

○ మట్టిలో మాణిక్యాలు..'వాత్సల్య' చిన్నారులు ○ టెన్త్‌లో మెరిసిన విద్యారత్నాలు

# పేరుకే అనాథలు... చదువులో అగ్రగాములు!





జె.వేణుగోపాల్ - 9.7 జిపిఏ


డి.రమాదేవి - 9.0 జిపిఏ


వి.సతీష్ - 8.3 జిపిఏ


కె.జగదీష్ - 7.3 జిపిఏ


ఆర్.లోకేష్ - 7.0 జిపిఏ

**జీవితంలో అన్నీ బాగానే వున్నా.. చదువులో మాత్రం సున్నాగానే వున్నవారు ఎందరో వుంటారు. కానీ, కొంతమంది దీనులు, విధివశాత్తూ అనాథలైనప్పటికీ.. జీవితంలో తమకంటూ ఎవరూ లేని అసహాయులుగా వున్నప్పటికీ, వారు చదువే శ్వాసగా.. ధ్యాసగా భావించి, అహోరాత్రులూ కష్టపడి చదువుకుని, చదువుల తల్లి ముద్దుబిడ్డలుగా రాణిస్తున్నారు... సింహపురి సీమకే గర్వకారణంగా నిలుస్తున్నారు.**

తల్లి ఒడిలాంటి 'వాత్సల్య' బడిలో చేరి ఎందరో విద్యార్థులు ప్రతిభతో రాణిస్తూ మట్టిలో మాణిక్యాలుగా భాసిస్తున్నారు.. నెల్లూరులోని 'వాత్సల్య' అనాథ శరణాలయమంటే, నిజంగా అది ఒక బడిగా కాదు.. చదువుల తల్లి గుడిగా ప్రసిద్ధి. అనాథలెందరినో అక్కున చేర్చుకునే కన్నతల్లిలాంటిదే వాత్సల్య అంటే. 'అమ్మ' లేని లోటును..తీర్చుతున్న చోటు ఇది. అందుకే, ఇక్కడున్న వారు ఏనాటికీ అనాథలు కాదనే చెప్పాలి. పేరుకు మాత్రమే వారు అనాథలు.. చదువులో మాత్రం అగ్రగాములు. అదీ..వాత్సల్య అంటే. అన్ని వసతులూ పుష్కలంగా వున్నా, తమ బిడ్డలు బాగా చదువుకోవాలని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి, వేలకు వేలు డబ్బులు ధారపోసి పెద్దపెద్ద కార్పొరేట్ స్థాయి విద్యాసంస్థల్లో చేర్చినా.. అనేకమంది విద్యార్థులు చదువులో మాత్రం శ్రద్ధ చూపక, ఆ తల్లిదండ్రులకు వేదననే మిగిలిస్తున్న ఈ రోజుల్లో, 'వాత్సల్య'లో చదువుకుంటున్న ఎంతోమంది అనాథలు, నిరుపేద విద్యార్థులు ఎంతో శ్రద్ధతో కష్టపడి చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతుండడం ఎంతైనా విశేషమే. ఇక్కడ వున్న భారతీయ విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ఏడాది జరిగిన 10వ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ పాయింట్లు సాధించి వాత్సల్య పేరును నిలబెట్టారు. వీరిలో జె.వేణుగోపాల్ అనే విద్యార్థి 9.7 పాయింట్లు సాధించి అందరి ప్రశంసలూ అందుకున్నాడు. అదేవిధంగా, డి.రమాదేవి అనే విద్యార్థిని 9.0 పాయింట్లు సాధించగా, వి.సతీష్ 8.7 పాయింట్లు, కె. జగదీష్ 7.3, ఆర్ లోకేష్ 7.0 పాయింట్లతో అత్యుత్తమ ప్రతిభను కనపరచి అందరి మన్ననలూ అందుకున్నారు. వీరంతా అనాథలే అయినప్పటికీ, చదువులో ఇంతగా ప్రతిభతో రాణించడం అందరినీ ఆశ్చర్యానందాలకు గురిచేసింది. కాగా, ఇదే పాఠశాలలో చేరి చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులు మరికొంతమంది కూడా టెన్త్ పరీక్షల్లో మంచి ప్రతిభతో ముందుండడం ఎంతో అభినందనీయం. అలా మంచి పాయింట్లు సాధించిన వారిలో పి.లలిత 9.5 పాయింట్లు, ఆర్.శిరీష 9.5, కె.వంశీకృష్ణ 9.0, వి.గాయత్రి 9.0, బి.సునీల్‌కుమార్ 7.8, సిహెచ్ కవిత 7.3, వై.పవిత్ర 6.2, ఎన్.శివాజీ 5.5, టి.రాజేంద్రకుమార్ 5.0 పాయింట్లు సాధించి అటు ఉపాధ్యాయుల, ఇటు స్థానికుల ప్రశంసలందుకున్నారు. ఈ సారే కాదు, గత ఏడాది కూడా ఈ స్కూల్‌లో మంచి ఫలితాలే వచ్చాయి. దీనంతటికీ ప్రధాన కారణం, అక్కడ అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందం, 'వాత్సల్య' కమిటీవారి సేవాభావమే కారణం. చక్కటి విద్యాబోధన, విద్యార్థులకు మంచి నడవడికను అలవరచడం, అన్నిటికీ మించి మన భారతీయ సంప్రదాయాలను ప్రతిబింబించేవిధంగా చదువును బోధించడం ఇక్కడి ప్రత్యేకత. కార్పొరేట్ స్కూళ్ళలో ప్రతి చిన్న విషయాన్నీ డబ్బుతో ముడిపెట్టి వున్న నేటి రోజుల్లో, ఇక్కడ అనేకమందికి ఉచితంగా, కొంతమందికి నామమాత్రపు ఫీజులతోనే విద్యను బోధిస్తున్నారు. వాత్సల్యలోని భారతీయ విద్యావికాస్ స్కూల్ అంటే అతితక్కువ ఫీజులతో, విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చే దిద్దే చదువుల తల్లి కోవెలగా ప్రసిద్ధి. చిన్నారులకు తెలుగుభాష ఔన్నత్యాన్ని తెలియజెప్పడం, పద్యశతకాలను నేర్పించడం, భగవద్గీత, లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామం పారాయణం చేయించడం, విద్యార్థుల్లో అటు సామాజిక పరిజ్ఞానంతో పాటు, ఇటు ఆధ్యాత్మిక జ్ఞానం కూడా వృద్ధి చెందేలా శ్రద్ధ తీసుకోవడం ఇక్కడి ప్రత్యేకతలు. అంతేకాదు, ఆంగ్లంలోనూ విద్యార్థులు మంచి పరిణతి సాధించేలా శిక్షణ ఇవ్వడం, విద్యార్థులు ఆహ్లాదంగా, ఉల్లాసంగా వుండేందుకు ఆట పాటలు, యోగా, కరాటే, నృత్యం తదితరాల్లోనూ శిక్షణ ఇస్తుండడం, అన్నిటికీ మించి పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించేలా తరగతులు నిర్వహించడం వంటివన్నీ ఇక్కడి విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తున్నాయి. నైతిక విలువలతో కూడిన విద్యను బోధించడం, విద్యతో పాటు వినయం, సంస్కారం పెంపొందేవిధంగా తగు శ్రద్ధ తీసుకోవడం, కేవలం ర్యాంకులు, మార్కులకోసం కాక జీవితంలో రిమార్కులు లేకుండా మంచి పౌరులుగా ఎదిగేలా చిన్నారులను తీర్చిదిద్దడం వాత్సల్య విశిష్టత. అనాథలు, నిరుపేదలైన చిన్నారులను ఎంతో ఆత్మీయతతో అక్కున చేర్చుకుని, వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు అహరహం కృషి చేస్తున్న వాత్సల్య కమిటీ ప్రతినిధులు సామంతు గోపాలరెడ్డి, బి.శ్రీనివాసులు రెడ్డి, సిహెచ్ వెంకటేశ్వరరెడ్డి, శ్రీమతి ఎం.రాధమ్మ, ఎన్.ప్రసాద్, టివిఎస్ దుర్గాప్రసాద్, జి.వి సాంబ శివరావు, పి.ఆదిశేషారెడ్డిలతో పాటు సభ్యులు ఎ.జయ ప్రకాష్, ఎంవి చలం, బివిఎస్‌బాబు తదితరుల సేవలు నిరుపమానం. వాత్సల్య నిరాధార బాలికల ప్రాంగణంలో సుమారు 117మంది బాలబాలికలు చదువుకుంటున్నారు. ఎంతో మంది వదాన్యులతో బాల బాలికలందరికీ చక్కని వసతులు కలుగజేసి వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. బడి-గుడి-అమ్మ ఒడి..అనే సదాశయంతో నిర్మించిన ఈ వాత్సల్య విద్యాసంస్థకు ఎందరో దాతలు తమ చేయూతను అందిస్తున్నారు. పూజ్యశ్రీ పరిపూర్ణానందస్వామీజీ ఇటీవలనే ఇక్కడికి విచ్చేసి బాలబాలికలను ఆశీర్వదించారు. బిజెపి అగ్రనాయకులు ముప్పవరపు వెంకయ్యనాయుడు, ప్రముఖ వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఇంకా జిల్లాలోని ఎందరో దాతలు, అధికారులు, మానవతాహృదయం వున్నవారు ఎంతో మంది ఈ వాత్సల్య పాఠశాలకు, ఇక్కడి చిన్నారులకు తమ వంతు సాయం అందించి, అనాథలు, నిరుపేదలైన ఆ బాలబాలికలు విద్యారంగంలో మరింతగా రాణించాలని ఆశీర్వదిస్తున్నారు.

## శిక్షణకు కలెక్టర్



జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ ఈ నెల 23 నుండి శిక్షణకు గాను ముస్సోరి వెళ్లనున్నారు. 8వారాల పాటూ ఇక్కడే శిక్షణలో ఉంటారు. కలెక్టర్‌లకు, ఐఏఎస్ అధికారులకు ప్రతి ఏడేళ్లకోసారి ఈ విధమైన శిక్షణ ఉంటుంది. దీనిలో భాగంగానే ఆయన వెళ్తున్నారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌గా ఎవరిని నియమిస్తారో ఇంకా తెలియలేదు. జేసీ రేఖారాణి ఇక్కడే వుంటే ఆమెనే ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌గా కొనసాగించే అవకాశముంది. అయితే ఆమె హైదరాబాద్‌కు బదిలీ ప్రయత్నంలో వున్నట్లు తెలుస్తుంది. దీంతో ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌పై సందిగ్ధత నెలకొంది.

## నెల్లూరు అభివృద్ధికి సహకరించండి


వెంకయ్యనాయుడుతో జిల్లా అభివృద్ధిపై చర్చిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరుజిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి సహకరించాలని నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి యం.వెంకయ్యనాయుడును కోరారు.

ఈ నెల 18వ తేదీన ఢిల్లీలోని వెంకయ్యనాయుడు ఇంటికెళ్లిన ఆదాల, జిల్లా సమగ్రాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను అందజేశారు. నెల్లూరులో ఐఐటి, ఐఐఎంలను ఏర్పాటు చేయాలని, వెంకటాచలంను ఐటి హబ్‌గా మార్చాలని ఆదాల కోరారు. బకింగ్‌హామ్ కెనాల్‌ను ఆధునికీకరించి జలరవాణాను అభివృద్ధి చేయాలన్నారు. రాచర్లపాడు వద్ద ఇఫ్కో సెజ్‌లో 3500 ఎకరాల భూములున్నాయని, ఇక్కడ వ్యవసాయానికి సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. ఇఫ్కో యూరియా కర్మాగారాన్ని నిర్మించాలని కోరారు. బిట్రగుంటలో రైల్వే లోకోషెడ్, కాంక్రీట్ స్లీపర్ కోచ్‌లను ఏర్పాటు చేయాలని అడిగారు. నెల్లూరులో బ్రిటీష్ కాలం నాటి డ్రైనేజీతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఆధునిక భూగర్భ డ్రైనేజీకి నిధులు మంజూరు చేయాలని కోరారు. నెల్లూరుకు రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయాలని, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని, మైపాడు నుండి కొత్తకోడూరు వరకు మోడరన్ బీచ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దామవరం వద్ద విమానాశ్రయం ఏర్పాటు, దుగరాజపట్నం, రామాయపట్నం పోర్టుల గురించి కూడా ఆయన వెంకయ్యనాయుడుతో చర్చించారు.






Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.